PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 22 | విజయవాడ, గురువారం 22 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 22 August 2024 | Rs

చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపుల నిరోధానికి ప్రత్యేక చట్టం
- కేరళ ప్రభుత్వ నిర్ణయం

8



శ్రీజేశ్‌కు కేరళ రూ.2 కోట్ల పురస్కారం

8

బతుకులు ఛిద్రం

ఫార్మా సెజ్‌లో రియాక్టర్ పేలి 18 మంది మృతి



మంటలనార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- 50 మందికిపైగా తీవ్ర గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- నేడు ఘటనా స్థలానికి చంద్రబాబు, రేపు జగన్
- కోటి రూపాయలు పరిహారం... యాజమాన్యంపై క్రిమినల్ చర్యలకు సిపిఎం డిమాండ్
- న్యాయవిచారణ జరపండి : సిఐటియు

ప్రజాశక్తి- అచ్యుతాపురం, అనకాపల్లి, అమరావతి బ్యూరో

జగ్గయ్యపేట అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ప్రమాదం మరవక ముందే రాష్ట్రంలో మరో పారిశ్రామిక ప్రమాదం జరిగింది. అనూహ్యంగా రియాక్టర్ పేలడంతో పెద్ద సంఖ్యలో కార్మికుల బతుకులు ఛిద్రమైనాయి. అనకాపలి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోనొ ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రయివేట్ లిమిటెడ్ మందుల పరిశ్రమలో జరిగిన ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈజ్ ఆఫ్ బిజినెస్ పేరుతో ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలను చర్చనీయాంశం చేసింది. బుధవారం మధ్యాహ్నం పేలుడు సంభవించగా రాత్రి 11 గంటల సమయానికి 18 మంది మరణించినట్లు తేలింది. సంఘటన స్థలంలో ఎక్కడ చూసిన తెగిపడిన శరీర భాగాలు కనపడుతున్నాయి. పేలుడు ధాటికి కుప్పకూలిన శిధిలాల తొలగింపు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. 50 మందికిపైగా తీవ్ర గాయాల పాలైనారు. ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సంఘటన స్థలానికి వెళ్లనున్నట్లు ప్రకటించారు. వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం బాధితులను పరామర్శించనున్నారు. మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాల్లో భాగమైన సిఐటియు ప్రమాదంపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేసింది.

ఎలా జరిగింది...?

తెల్లవారుజామున ప్రారంభమైన 'ఏ' షిఫ్ట్ మరికొన్ని నిమిషాల్లో ముగిసే సమయమది. మధ్యాహ్నం నుండి బి షిఫ్ట్‌లో చేరే కార్మికులు మిషన్ల వద్దకు రావడం ప్రారంభమైంది. ఉదయం షిఫ్ట్‌లో ఉన్నవారు తమ తరువాత వచ్చే వారికి పనులు అప్పగించి ఇళ్లకు వెళ్లే హడావిడిలో ఉన్నారు. దీంతో కంపెనీ అంతా సందడి వాతావరణం నెలకొని అంది. అప్పుడు అనూహ్యంగా మూడవ ఫ్లోర్‌లో ఉన్న రియాక్టర్ భయంకరమైన శబ్దం చేస్తూ ఒక్కసారిగా పేలిపోయింది. ఏం జరుగుతోందో అర్థం చేసుకునే లోపే మృత్యురక్కసి కార్మికులపై విరుచుకుపడింది. పేలుడు ధాటికి ఒకటి, రెండు అంతస్తులు కుప్పకూలడంతో అక్కడ ఉన్న కార్మికులు శిధిలాల కింద చిక్కుకుపోయారు. ఈ శిధిలాల కింద ఏడు మృత దేహాలు లభించాయి. పేలుడు శబ్దం కిలోమీటరు దూరానికిపైగా మిగతా 7లో



గుండెలవిసేలా రోదిస్తున్న మహిళ

గ్రూప్-1 మెయిన్స్ మరోసారి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1 ప్రధాన పరీక్షలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) మరోసారి వాయిదా వేసింది. సెప్టెంబరు 2 నుంచి 9 వరకు జరగాల్సిన పరీక్షలను డిసెంబరు 12వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషన్ కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వాయిదా వేయాలని అభ్యర్థులు కమిషన్‌కు పలు వినతిపత్రాలు అందించారని, ఈ దృష్ట్యా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

చంద్రబాబుకు భారీ ఊరట

ఓటుకు నోటు కేసులో రెండు పిటిషన్లు డిస్మిస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓటుకు నోటు కేసులో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భారీ ఊరట లభించింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని, కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని వైసిపి నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్‌కె) దాఖలు చేసిన రెండు పిటిషన్లను ధర్మాసనం డిస్మిస్ చేసింది. రాజకీయ కక్ష సాధింపులకు న్యాయస్థానాన్ని వేదికగా చేర్చుకోవద్దంటూ పిటిషనరు రామకృష్ణారెడ్డిని జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం మందలించింది.

ఈ కేసుతో ఎటువంటి సంబంధం లేని, సాక్షి, బాధితుడు కాని వైసిపి నేత ఆర్‌కె, ఈ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు అయినప్పటికీ, మళ్లీ ఫ్రెష్‌గా విచారణ జరపి, చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని కోరతూ లోయర్ కోర్టు (ఎసిబి కోర్టు)లో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై విచారించిన ఎసిబి కోర్టు, ఆర్‌కెకు అనుకూలంగా ఫ్రెష్‌గా విచారణ జరపాలని ఎసిబిని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. దీనిపై తెలంగాణ హైకోర్టును చంద్రబాబు ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు, ఎసిబి తీర్పును పక్కన పెట్టింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆర్‌కె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో పాటు ఈ కేసు విచారణ సిబిఐకి అప్పగించాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లను బుధవారం విచారణ జరిపిన జస్టిస్ సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం డిస్మిస్ చేసింది.

2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు, తెలంగాణలో అప్పటి టిడిపి ఎమ్మెల్యే, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను కొనుగోలుకు డబ్బులిచ్చినట్లు వీడియో ఫుటేజ్ బయటకు వచ్చింది. అలాగే స్టీఫెన్‌సన్‌తో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడిన ఆడియో రికార్డులు కూడా బయటకు వచ్చాయి. ఈ కేసులో రేవంత్ రెడ్డి జైలుకూ వెళ్లారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



ఎగసిపడుతున్న మంటలు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నం సమీపంలోని పంటపాలెం వద్ద ఎఫ్ఎఫ్ఎఫ్ పామాయిల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. దీంతో, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పరిసర ప్రాంతాల్లోని పామాయిల్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కృష్ణపట్నం, నెల్లూరు నుండి ఎనిమిది ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని అతి కష్టమ్మీద మంటలను ఆర్పాయి. సింగపూర్, మిగతా 7లో

మహిళలపై నేరాల్లో 151 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు

- 16 మందిపై అత్యాచార కేసులు
- అత్యధికం బిజెపి నేతలపైనే

ఢిల్లీ : మహిళలపై నేరాలను అరికట్టాల్సిన చట్టసభ సభ్యులే ఈ నేరాలకు సంబంధించిన కేసుల్లో చిక్కుకున్నారు. అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న బాపతు కూడా వీరిలో ఉన్నారు. 151 మంది ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేలు మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను ఎదుర్కొంటున్నారు. ఈ ప్రబుద్ధుల్లో 16 మందిపై అత్యాచార కేసులు కూడా ఉన్నాయి. కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం జరిపి, హత్య చేసిన దారుణ ఘటనపై దేశవ్యాపితంగా నిరసనాగ్రహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) విడుదలజేసిన తాజా నివేదిక ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీలవారీగా చూస్తే ఇటువంటి క్రిమినల్ కేసులెదుర్కొంటున్నవారిలో బిజెపి ఈ కేసులు ఎదుర్కొంటున్న వారిలో 54 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలతో బిజెపి మొదటి స్థానంలో ఉండగా, 24 మందితో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్రాల వారీగా చూస్తే 25 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఇక్కడ కూడా పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో నిలవగా 21 మందితో ఆంధ్ర ప్రదేశ్ రెండో స్థానంలోను, 17 మందితో ఒడిశా మూడవ స్థానంలోను నిలిచాయి. ఇది చాలా సిగ్గుచేటైన విషయం. 2019 నుంచి 2024 మధ్య ఎన్నికల కమిషన్‌కు ఎంపిలు, ఎమ్మెల్యేలు సమర్పించిన 4,809 అఫిడవిట్లలో 4,693ను విశ్లేషించి ఈ నివేదిక రూపొందించినట్లు ఎడిఆర్ తెలిపింది. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను ఎదుర్కొంటున్న 151 మందిలో 16 మంది ఎంపీలు, 135 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని ఎడిఆర్ వివరించింది. లైంగికదాడి కేసులు ఎదుర్కొంటున్న 16 మందిలో ఇద్దరు సిట్టింగ్ ఎంపిలు, 14 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారని, వీరిపై నేరాలు రుజువైతే పదేళ్లు లేదా జీవిత కారాగార శిక్ష పడే అవకాశం ఉందని ఆ నివేదిక స్పష్టం చేసింది. దీనికి ఎడిఆర్ కొన్ని పరిష్కార మార్గాలను కూడా సూచించింది. వాటిలో రాజకీయ పార్టీలు ఇటువంటి నేతలకు టికెట్లు ఇవ్వకూడదని సూచించింది. అలాగే కోర్టు కేసులపై సమగ్ర దర్యాప్తు జరిపించి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో త్వరిత గతిన విచారణ పూర్తి చేయాలని కోరింది. ఇలాంటి నేతలను ఎన్నుకోకుండా ప్రజలు దూరం పెట్టాలని ఓటర్లకు ఎడిఆర్ విజ్ఞప్తి చేసింది.



మండలి ప్రతిపక్షనేత బొత్స

- లేళ్ల అప్పిరెడ్డి రాజీనామా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలి ప్రతిపక్ష నేత పదవికి లేళ్ల అప్పిరెడ్డి బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు పంపారు. ఈ నేపథ్యంలో వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ పార్టీ అధినేత తనపై నమ్మకం వుంచి శాసనమండలి ప్రతిపక్ష నేతగా అవకాశం కల్పించారని తెలిపారు. తన కంటే ఈ పదవికి అన్ని రకాలుగా సీనియర్ నేత బొత్స సత్య నారాయణ అయితే బాగుంటుందని అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సూచిం చానన్నారు. తన ప్రతిపాదనకు ఆయన ఆమోదం తెలిపారన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఇన్‌ఛార్జిగా పార్టీ కార్యకర్తలకు, రాష్ట్ర పార్టీకి అనుసంధానంగా వుండేందుకు ఈ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు.

పోలీసింగ్‌తో భద్రత, భరోసా

- హోంశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు
- సెప్టెంబరులో గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీలు



హోంశాఖపై జరిగిన సమీక్షలో సిఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత, డిజిపి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలకు భద్రత, భరోసా కలిగేలా పోలీసింగ్‌ను నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సచివాలయంలో బుధవారం హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, డిజిపి ద్వారకా తిరుమలరావు తో కలిసి హోం శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసింగ్‌లో మార్పు కనిపించాలని, నేరం చేస్తే శిక్ష తప్పదనే భయం కలగాలని అన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, అదే స మయంలో పోలీసు సిబ్బందిలో అలసత్వాన్ని కూడా సహించేది లేదని చెప్పారు. నేరం జరిగిన తర్వాత నేరస్తులను పట్టుకోవడం ఒక ఎత్తయితే అసలు నేరం చేయాలంటేనే భయపడే పరిస్థితులు రావాలన్నారు. రాజకీయ ముసుగులో ఎవరైనా అరాచకాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో గంజాయిసాగు, సరఫరా, వాడకం విపరీతంగా పెరిగిందన్నారు. డ్రోన్స్‌ను వినియోగించి గంజాయి పంట ఎక్కడ ఉందో గుర్తించి నాశనం చేయాలన్నారు. సెప్టెంబరు నెలలో 26 జిల్లాల్లో గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. నేరం జరిగిన వెంటనే క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ బృందాలు ఎందుకు వెళ్లడం లేదని చంద్రబాబు పోలీస్ అధికారులను ప్రశ్నించారు. ఇకపై ఆ పరిస్థితి మారాల్సిందేనన్నారు. నేరం జరిగిన చోట వేగంగా పోలీసులు స్పందించకపోతే తానే స్వయంగా కొన్ని ఘటనలకు వెళ్లి విచారణను పర్యవేక్షిస్తానని చెప్పారు. సైబర్ క్రైమ్‌ను ఎదుర్కోవడానికి నిపుణలతో చర్చించాలని అవసరమైతే కొత్త చట్టాలు తీసుకువద్దామని అన్నారు. ప్రతి జిల్లాలో ఒక సైబర్ పోలీస్ స్టేషన్‌ను పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ విషయంలో తీసుకునే చర్యలపై ప్రణాళికను రూపొందించాలన్నారు. వాహనాల ఫిట్‌నెస్ విషయంలో తనిఖీలు నిర్వహించాలని, ఈవిషయంలో వాహనదారులను వేధిస్తున్నట్లుగా కాకుండా ప్రజల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కఠినంగా ఉండాలని సిఎం ఆదేశించారు. మహిళలపై హింస విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజని నేరస్తులకు అర్థంకావాలన్నారు. పోలీసు శాఖలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక ఇబ్బందులు తొలగించేందుకు అవసరమైన నిధులు విడుదలకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా వ్యవస్థలో పరికరాల నిర్వహణ మిగతా 7లో

ఎట్టకేలకు సిఐఎస్‌ఎఫ్ భద్రత

- ఆర్‌జికర్ ఆస్పత్రి వద్ద 150 మంది మోహరింపు
- పాలిగ్రాఫ్ పరీక్షకుసిబిఐ యోచన



ఆర్‌జికర్ ఆస్పత్రి వద్ద సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది

న్యూఢిల్లీ/ కోల్‌కతా :

న్యూఢిల్లీ/ కోల్‌కతా : ఆర్‌జి కర్ ఆస్పత్రిలో భద్రత కోసం 150 మంది కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సిఐఎస్‌ఎఫ్) సిబ్బందిని మోహరించనున్నారు. ఆర్‌జి కర్ ఆస్పత్రి వద్ద నిరసనలు ఉవ్వెత్తున సాగుతున్న దరిమిలా సుప్రీం ఆదేశాల మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ మేరకు ఒక లేఖ రాసింది. డిఐజి ర్యాంక్ అధికారి నేతృత్వంలో సిఐఎస్‌ఎఫ్ బృందం బుధవారం ఉదయం ఆస్పత్రి సముదాయాన్ని సర్వే చేసింది. పోలీసు, ఆస్పత్రి అధికారులతో సిఐఎస్‌ఎఫ్ డిఐజి సమావేశాన్ని కూడా నిర్వహించారు. రెసిడెంట్ డాక్టర్స్ హాస్టల్ వద్ద , ఇతర కీలకమైన ప్రదేశాల్లో సిఐఎస్‌ఎఫ్ సిబ్బందిని మోహరించనున్నారు. ఆర్‌జి కర్ ఆస్పత్రిపై దాడిని నివారించడంలో పోలీసుల అలసత్వంపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 7వేల మంది ఆస్పత్రిలో చొరబడి విధ్వంసం సృష్టించే దాకా పోలీసులు ఏం చేస్తున్నారని, ఇంత పెద్ద సంఖ్యలో ఎక్కడి నుంచి వచ్చారో పోలీసుల వద్ద సమాచారం లేదనడం ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్యానించిన హైకోర్టు ధర్మాసనం ఆస్పత్రి వద్ద భద్రత కల్పించాలని ఆదేశించింది. ఆస్పత్రిలో విధ్వంసాన్ని అదుపు చేయడంలో విఫలమైనందుకు ఇద్దరు పోలీసు అసిస్టెంట్ కమిషనర్లను, ఒక ఇన్‌స్పెక్టర్‌ను డిజిపి సస్పెండ్ చేశారు.

సందీప్ ఘోష్ కారు డ్రైవర్‌ను విచారించిన సిబిఐ

కొల్‌కతాలోని ఆర్‌జికర్ ఆస్పత్రి మాజీ డైరక్టర్ సందీప్ ఘోష్‌ను, ఆయన కారు డైవర్‌ను, మరో అయిదుగురు జూనియర్ డాక్టర్లను సిబిఐ బుధవారం విచారించింది. ఘోష్‌ను ఆరవసారి సిబిఐ విచారించింది. గత అయిదు రోజుల్లో సందీప్ ఘోష్‌ను సిబిఐ 64 గంటలపాటు విచారించింది. తాము అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన కొన్ని సమాధానాల్లో పొంతన లేదని, అందువల్ల సంజయ్ రాయ్, సందీప్ ఘోష్‌లకు పాలిగ్రాఫ్ టెస్టు నిర్వహించే యోచన చేస్తున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించి ఇప్పటికే స్థానిక కోర్టు నుంచి అనుమతి పొందింది. అయితే పాలిగ్రాఫ్ టెస్టు ద్వారా వచ్చిన నిర్ధారణలు కచ్చితమైన ఆధారాలుగా కోర్టులు పరిగణించవు.గత కొద్ది రోజులుగా సిబిఐ అధికారులు ఘోష్‌ను వివిధ రకాల ప్రశ్నలు అడిగారు. డాక్టర్ మృతి వార్త తెలిసిన తర్వాత ఆయన వ్యవహరించిన తీరు, పోషించిన పాత్రను ప్రశ్నించారు. తమ కుమార్తె మృత దేహాన్ని చూసేందుకు ఆ తల్లిదండ్రులను మూడు గంటలకు పైగా వేచి వుంచాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలని కోరారు. పైగా సంఘటన జరిగిన వెంటనే సెమినార్ హాల్‌కు ఆనుకుని వున్న గదులకు మరమ్మతులు చేసేందుకు అనుమతి ఇవ్వడాన్ని కూడా వారు ప్రశ్నించారు. అంత హడావిడిగా చేయాల్సిన అవసరమేమొచ్చిందని అడిగారు.ప్రధాన నిందితుడు, ఆర్‌జికర్ ఆస్పత్రితో సంబంధం లేని సివిక్ వలంటీర్ సంజయ్ రాయ్ జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన తరువాత బ్యారక్‌కు వెళ్లి నిద్రపోయాడని, మరుసటి రోజు ఉదయాన్నే లేచి ఆధారాలను నాశనం చేశాడని సిబిఐ అధికారులు తెలిపారు. నిందితుడి కాలి బూట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించామని వారు చెప్పారు.

నిరసనలు ఉధృతం

6

వార్సా చేరుకున్న మోడీ

- ద్వైపాక్షిక సహకారంపై చర్చ
- అటు నుంచి ఉక్రెయిన్‌కు

7



హనకనహాల్ గ్రామం వాగులో చిక్కుకుపోయిన ట్రిప్పర్

'అనంత', శ్రీశైలంలో కుండపోత

- ఉరుములు, మెరుపులతో బీభత్సం

3

ఎన్నేళ్లకు అభివృద్ధి అవుతుంది?

- ప్రపంచ బ్యాంకు బృందం ప్రశ్నలు
- ప్రాజెక్టులపై అధికారుల వివరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి ఎన్నేళ్లకు అభివృద్ధి అవుతుంది, ఆదాయం ఎలా పెరుగుతుంది అనే అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని సిఆర్‌డిఎ అధికారులకు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ప్రశ్నించారు. అధికారులు ఇచ్చే వివరణ ఆధారంగా తిరిగి చెల్లింపులపై మారిటోరియం నిర్ణయించే విషయాన్ని పరిశీలిస్తామని తెలిపింది. రూ.15 వేల కోట్ల నిధులకు సంబంధించి ప్రపంచ బ్యాంకు బృందం అమరావతి పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం సిఆర్‌డిఎ కార్యాలయంలో అధికారులతో పలు అంశాలపై చర్చించారు. రాజధానికి సంబంధించిన వివిధ అంశాలపై అధికారులు సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నిధులు తీసుకున్న అనంతరం రాజధాని ఎప్పటికి పూర్తవుతుంది, ఎంత పెట్టుబడులు రావొచ్చు అనే అంశాలపై అధికారులను వివరాలు కోరినట్లు తెలిసింది. ప్రాథమికంగా నిధులిచ్చేందుకు అంగీకరించిన ప్రతినిధి బృందం తిరిగి చెల్లించే అంశంపైన స్పష్టమైన వివరాలను బ్యాంకుకు సమర్పించాల్సి ఉంటుంది. ఆదాయ మార్గాల వివరాలనూ వెల్లడించాలని, పర్యావరణ ప్రభావ అంచనాలు, జనాభా పెరుగుదలకు సంబంధించిన వివరాలను సిఆర్‌డిఎ అధికారులు ప్రతినిధులకు తెలిపారు.

2030 నాటికి ఈ ప్రాంతంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని, దీని ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం అమరావతిలో 1,310 కిలోమీటర్ల ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్‌పిఎస్) రోడ్లు నిర్మించాల్సి ఉందని, 2,308 కిలోమీటర్ల దూరం నీటి సరఫరా పైపులైన్లు వేయాల్సి ఉందని పేర్కొన్నారు. 966 కిలోమీటర్ల దూరం సివరేజీ లైన్లు, 2,477 కిలోమీటర్ల వర్షపునీటి కాలువలు, 11,184 కిలోమీటర్ల పవర్ డక్ట్, 2,680 కిలోమీటర్ల పునర్వినియోగ నీటి పైపులైన్లను ఏర్పాటు చేయాలని గత ప్రణాళికలో పేర్కొన్నామని తెలిపారు. వీటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు సమకూర్చాలని కోరారు. అమరావతి మెరీనా పేరుతో పర్యాటక ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ భవనాల నిర్మాణంతోపాటు, సదుపాయాల కల్పన ప్రభుత్వ తొలి ప్రాధాన్యతగా అధికారులు వివరించారు. దీనిలో నగర నిర్మాణం అనంతరం యూజర్ ఛార్జీల వసూలు అంశాలపైనా సిఆర్‌డిఎ అధికారులు వివరించినట్లు తెలిసింది.



సత్యసాయి జిల్లా హిందూపురంలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు



విజయవాడలో నిరసనలో పాల్గొన్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి



విశాఖలో ప్రదర్శన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

వెల్లువెత్తిన వైద్యుల నిరసనలు

- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కోల్‌కత్తాలోని ఆర్‌జి కార్ ఆస్పత్రిలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యను నిరసిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, కొవ్వొత్తుల ర్యాలీలు, మానవహారాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, అసలైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మెడికో కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో అంగన్‌వాడీ, ఐద్వా, హాకర్స్, ముఠా, ఆశా తదితర రంగాలకు చెందిన మహిళా ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాచవరంలోని అంబేద్కర్ భవన్‌లో 'పూలే - అంబేద్కర్' ట్యూషన్ పాయింట్ విద్యార్థులు, మహిళలు, కెవిపిఎస్ నాయకులు చేపట్టిన కొవ్వొత్తుల ప్రదర్శనలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సింగ్‌నగర్‌లో ఐద్వా రాష్ట్ర నాయకులు కె.శ్రీదేవి మాట్లాడుతూ.. మహిళలకు, మహిళ డాక్టర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జూనియర్ డాక్టర్లు ఆంధ్ర మెడికల్ కళాశాల నుంచి మానసిక ఆసుపత్రి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యాన మానవహారం చేపట్టారు. అనంతరం నిరసన ప్రదర్శన చేశారు. భెల్ విశాఖ యూనిట్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనకాపల్లిలో సిఐటియు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. పరవాడ పోలీస్ స్టేషన్ ఎదుట గాజువాక -ఎలమంచిలి మెయిన్ రోడ్డుపై సిఐటియు, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన మానవహారంగా ఏర్పడ్డారు. అల్లూరి జిల్లా రంపచోడవరంలో సిఐటియు కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ చేసి అక్కడ మానవహారం నిర్వహించారు. చింతూరులో ఐటిడిఎ కార్యాలయం ఎదుట ఆందోళన, అనంతరం మానవహారం చేపట్టారు. అనంతగిరిలో హ్యూమన్ రైట్స్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కర్నూలు మెడికల్ కళాశాల ఆవరణంలో జూడాలు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎంపి బస్తిపాటి నాగరాజు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్లో సిఐటియు, అంగన్‌వాడీ, ఆశా, ఆటో వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. శ్రామిక మహిళ సంఘం, సిఐటియు నేతలు, కార్యకర్తలు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి నుంచి కళ్లకు గంతలు కట్టుకుని ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. శ్రీ పాద శ్రీ వల్లభ కూచిపూడి నాట్య నిలయం వారు దొండపాడు నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. నిడమర్రులో స్కీమ్ వర్కర్లు, మహిళలు శాంతి ర్యాలీ నిర్వహించారు. వేలేరుపాడులో ఎంపిడిఒ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు కళ్లకు గంతలు కట్టి ర్యాలీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సిఐటియు ఆధ్వర్యాన ధర్నా, ఆకివీడులో ఆదిత్య విద్యా సంస్థల విద్యార్థులు ర్యాలీ చేశారు. తణుకులో సిఐటియు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రాయదుర్గం, అనంతపురం, చిలమత్తూరు, ధర్మవరం, లేపాక్షి, సోమందేపల్లి, పెనుకొండ, పుట్టపర్తి, గోరంట్ల, ముదిగుబ్బ తదితర మండలాల్లో నిరసనలు కొనసాగాయి. ఆయా మండలాల్లో సిఐటియు నాయకులు, అంగన్‌వాడీలు ర్యాలీలు నిర్వహించి మానవహారం చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో వైద్య విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన సిపిఎం కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ నిరసన ప్రదర్శన చేసి, అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. సాలూరు, సీతానగరంలో ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు నిరసన ప్రదర్శనలు చేశారు. కాకినాడ జిల్లా ఆసుపత్రిలో జూడాల రిలే నిరహార దీక్షల శిబిరాన్ని సిపిఎం బృందం సందర్శించి సంఘీభావం తెలిపింది. సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా నిరసన శిబిరానికి వెళ్లి నేతలు మద్దతు ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, యుటిఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యాన క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.



విజయవాడ లెనిన్ సెంటర్‌లో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ఢిల్లీలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో మకాం వేశారు. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లిన ఆయన నేరుగా సిఎం అధికారిక నివాసం 1-జన్‌పథ్‌కు చేరుకున్నారు. అక్కడే పలువురు అధికారులతో సమావేశమైనట్లు సమాచారం. అయితే మంత్రి ఢిల్లీ పర్యటనకు సంబంధించి ఎటువంటి ప్రకటన ప్రభుత్వం నుంచి వెలువడలేదు. మంత్రి అధికారిక పర్యటనలో ఢిల్లీకి వచ్చారా? లేక వ్యక్తిగత పర్యటనకు వచ్చారా? అనేది స్పష్టం కాలేదు. ఇటు ప్రభుత్వం నుంచి, అటు టిడిపి వర్గాల నుంచి ఎటువంటి సమాచారం వెలువడలేదు. మంత్రి నారా లోకేష్ పర్యటన అంతా గోప్యంగానే ఉంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

వైసిపి కేంద్ర కార్యాలయానికి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయానికి పోలీసులు నోటీసులు అంటించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన రోజు 2021 అక్టోబరు 19న వైసిపి కార్యాలయంలోని సిసి ఫుటేజ్ సమర్పించాలని నోటీసులిచ్చారు. ఘటన జరిగిన రోజు వైసిపి కార్యాలయం నుంచి ఎవరెవరు బయల్దేరారనే అంశంపై పోలీసులు విచారణ చేపట్టారు. ఇదే ఘటనకు సంబంధించి వైసిపి నాయకులు దేవినేని అవినాష్‌కు కూడా పోలీసులు నోటీసులిచ్చారు. విజయవాడలోని గుణదలలో ఆయన ఇంటికి ఈ నోటీసును పోలీసులు అంటించారు. తాము పిలిచిన రోజు విచారణకు రావాలని పేర్కొన్నారు.

జగన్ విదేశీ పర్యటనకు అనుమతివ్వొద్దు : సిబిఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వవద్దని కోర్టును సిబిఐ కోరింది. బెయిల్ షరతులను సడలించి లండన్ పర్యటనకు అనుమతివ్వాలన్న జగన్ పిటిషన్‌పై బుధవారం సిబిఐ కౌంటర్ దాఖలు చేసింది. అక్రమాస్తుల కేసులో వైఎస్ జగన్ ప్రధాన నిందితుడుగా ఉన్నారని, ఆ కేసుల విచారణ కీలక దశకు చేరుకుందని సిబిఐ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న సిబిఐ కోర్టు న్యాయమూర్తి డా.టి రఘురాం... పిటిషన్‌పై నిర్ణయాన్ని ఈనెల 27కు వాయిదా వేశారు. యుకెలో చదువుతున్న తన కుమార్తె వద్దకు సెప్టెంబర్ మొదటి వారంలో వెళ్లడానికి అనుమతివ్వాలని మంగళవారం సిబిఐ కోర్టులో జగన్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే.

కన్నయ్యకు సిఎం సత్కారం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తుంగభద్ర డ్యామ్‌లో గేటు కొట్టుకుపోయిన ఘటనలో నీటి వృథాను అరికడుతూ స్టాప్ లాక్‌ను విజయవంతంగా ఏర్పాటు చేయించిన ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు కన్నయ్య నాయుడును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో కన్నయ్యకు సిఎం బుధవారం శాలువాను కప్పి సత్కరించారు. వరద ప్రవాహం ఉధృతంగా వున్నా.. ఏమాత్రం అధైర్యపడకుండా కన్నయ్య విజయవంతంగా 19వ గేట్‌కు 30 టిఎంసిల నీటిని వృథా కాకుండా కాపాడారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ.. గత 52 ఏళ్లుగా సాగునీటి రంగంలో పనిచేస్తూ దక్షిణాది రాష్ట్రాల్లో ఇలాంటి గేట్లు ఎన్నో ఏర్పాటు చేశామన్నారు. తుంగభద్ర డ్యామ్‌ను 1954లో కమిషనింగ్ చేశారని, దాని కాలపరిమితి 45 ఏళ్లుకాగా, ఇప్పటికే 70 ఏళ్లపాటు పనిచేస్తోందని అన్నారు. 1970లోపు ఏర్పాటు చేయబడిన తుంగభద్ర, ప్రకాశం, నాగార్జున సాగర్ డ్యామ్‌లకు స్టాప్ లాక్స్ లేవన్నారు. 2002లో ప్రకాశం బ్యారేజ్ గేట్లు మార్చారన్నారు. తీవ్రమైన వరద నీటిలో రిస్కు తీసుకుని తుంగభద్ర రిజర్వాయరు గేటు మార్చే పనిని ఛాలెంజ్‌గా తీసుకున్నామని తెలిపారు. 50 మంది సాయంతో ఐదు రోజుల్లో గేటు డిజైన్ చేసి ఏర్పాటు చేయడం ఒక రికార్డు అన్నారు. ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, సిద్ధ రామయ్య సహకారంతోనే సకాలంలో పనిని పూర్తి చేయగలిగామని తెలిపారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... టిబి డ్యామ్‌లో వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుండగా, దెబ్బతిన్న 19వ గేటు స్థానంలో స్టాప్ లాక్‌ను గేటు ఏర్పాటు చేయడం అనేది దేశ చరిత్రలోనే ఒక అపూర్వమైన ఘట్టమని అన్నారు. రాష్ట్ర రైతాంగం తరపున సాగునీటి రంగ నిపుణులు కన్నయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వాయరులో నీరు నిల్వ ఉండటం వల్ల రాయలసీమ ప్రాంతంలోని ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి, కెసి కెనాల్ ఆయకట్టుకు ముప్పు తప్పినట్లయిందన్నారు. అలాగే రాయలసీమ జిల్లాల తాగునీటి సమస్యకు పరిష్కారం దొరికిందన్నారు.

పోలీసు విచారణకు జోగి రమేష్ హాజరు

- సహకరించలేదన్న డిఎస్‌పి
- అన్నింటికీ సమాధానమిచ్చానన్న మాజీ మంత్రి

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నివాసంపై దాడి ఘటనలో గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ పోలీసులు బుధవారం మాజీ మంత్రి జోగి రమేష్‌ను విచారించారు. దాడి ఘటనకు సంబంధించి ఆ రోజు వినియోగించిన ఫోన్, సిమ్ కార్డులను ఇవ్వాలని పోలీసులు కోరిన నేపథ్యంలో ఆయన తన లాయర్లను పోలీస్ స్టేషన్‌కు పంపారు. వారు ఇచ్చిన వివరాలకు పోలీసులు సంతృప్తి చెందలేదు. నిందితుడే స్వయంగా హాజరు కావాలంటూ జోగి రమేష్‌కు మూడోసారి నోటీసులు ఇచ్చారు. దీంతో, ఆయన బుధవారం స్వయంగా విచారణకు హాజరయ్యారు. గుంటూరు నార్త్ సబ్ డివిజన్ డిఎస్‌పి మురళీకృష్ణ, సిఐ శ్రీనివాసరావు ఆయనను దాదాపు గంటకుపైగా విచారించారు. అనంతరం మీడియాతో డిఎస్‌పి మాట్లాడుతూ పోలీసుల విచారణ సమయంలో అడిగిన వివరాలు అందజేయాల్సిన బాధ్యత నిందితులకు ఉంటుందన్నారు. జోగి రమేష్‌కు చట్టప్రకారమే నోటీసులు ఇచ్చామని, విచారణకు ఎప్పుడు పిలిచినా సహకరించాల్సిందేనని చెప్పారు. విచారణ సమయంలో తమకు ఆయన సహకరించలేదని తెలిపారు. విచారణ అనంతరం జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకూ సమాధానం చెప్పానని, విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెప్పారు.

రాష్ట్ర బంద్ ప్రశాంతం

- అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసనలు
- పలు జిల్లాల్లో పాఠశాలలు, దుకాణాలు మూసివేత
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. అంబేద్కర్ యువసేన, మాల మహానాడు, చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకోలు, అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసన తెలిపారు. పలు జిల్లాల్లో స్వచ్ఛందంగా దుకాణాలు, పాఠశాలలు మూతపడ్డాయి. తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. బంద్‌కు సహకరించాలని కోరిన యువకుడిపై ఏలూరులో ఓ హోటల్ యజమాని కూరగాయల కత్తితో దాడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వేస్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బంద్ కారణంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి. అమలాపురం, రామచంద్రపురం, ఆలమూరు, రాజోలు, ఉప్పలగుప్తం, మామిడికుదురు, అయినవిల్లి తదితర చోట్ల బంద్ విజయవంతమైంది. ఏలూరు కొత్త బస్టాండ్, గ్యారేజీ వద్ద ధర్నా నిర్వహించి బస్సులు నిలిపివేశారు. కొద్దిసేపటి తర్వాత బస్సులు యధావిధిగా తిరిగాయి. కుక్కునూరులో ప్రధాన రహదారి వద్ద రాస్తారోకో నిర్వహించారు. టి.నరసాపురం మండలం బంధంచర్లలో బంద్‌కు సహకరించాలని కోరిన యువకుడిపై ఉల్లిపాయలు కోసే కత్తితో హోటల్ యజమాని దాడి చేశాడు. నెల్లూరులో బంద్ పాక్షికంగా జరిగింది. మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణా వెంకయ్య మాట్లాడుతూ.. ఎస్‌సి వర్గీకరణ వల్ల దళితుల్లో ఐక్యత భావం దెబ్బంతిటుందన్నారు. గుంటూరు జిల్లా పొన్నూరులో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు వినతిపత్రం అందించారు.

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు, గన్నవరం, హనుమాన్‌జంక్షన్, మచిలీపట్నం, అవనిగడ్డ తదితర ప్రాంతాల్లో వ్యాపార దుకాణాలు, పాఠశాలలు మూతపడ్డాయి. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, విద్యాసంస్థలు, ముఖ్య కూడళ్ల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరులో ఎస్ఆర్‌పురం, జిడి నెల్లూరు, కార్వేటినగరం, బంగారుపాళ్యం మండలాల్లో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం, కర్నూలు జిల్లా దేవనకొండ, ఆలూరు, ఆస్పరి, ఎమ్మిగనూరులో రాస్తారోకో చేశారు. అనంతపురం జిల్లా గుత్తి, పామిడి, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో కదిరి, కొత్తచెరువు తదితర ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట-మార్టేరు ఆర్అండ్‌బి రహదారిపై బైఠాయించారు. పెనుమంట్రలో మార్టేరు సెంటర్‌లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి బంద్ నిర్వహకులు పాలాభిషేకం చేశారు. తణుకు మహిళా కళాశాల వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నరసాపురంలో దుకాణాలు మూతపడ్డాయి. అనకాపల్లి జిల్లా అనకాపల్లి, మునగపాక, దేవరాపల్లి, బుచ్చయ్యపేట మండలం వడ్డాది తదితర కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విశాఖ జిల్లా కూర్మన్నపాలెంలో రాస్తారోకో చేశారు. కడప, ప్రకాశం, గుంటూరు, విజయనగరంలో బంద్ పాక్షికంగా జరిగింది.



కర్నూలు జిల్లా ఆస్పరి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జైభీమ్ నాయకులు

ప్రతి గ్రామసభకు ప్రత్యేక అధికారి

- 23న ఉపాధి హామీ సభలపై కలెక్టర్లకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈ నెల 23న ఒకరోజు నిర్వహించే గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని, దీనికోసం ప్రతి సభకూ ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాదు కలెక్టర్లను ఆదేశించారు. గ్రామసభలు, ఉచిత ఇసుక విధానంపై బుధవారం సచివాలయం నుండి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామసభలపై సిఎస్ మాట్లాడుతూ ఉపాధి హామీపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, ఒక గ్రామం నుండి మరో గ్రామానికి, గ్రామం నుండి మండల కేంద్రానికి అనుసంధానం చేసే రహదారుల నిర్మాణం, వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ 23న గ్రామ సభల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని తెలిపారు.

సెప్టెంబరు 11 నుండి ఇసుక విధానం

సెప్టెంబరు 11వ తేదీ నుండి నూతన ఇసుక పాలసీ అమలు చేయనున్నట్లు సిఎస్ తెలిపారు. ఈ విధానం అమలుకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రీచ్‌ల వారీగా తవ్వకం, రవాణాకు సంబంధించిన ధరలను కలెక్టర్లు నిర్ధారించాలని తెలిపారు. నిర్ణీత ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌ల్లో బుకింగు చేసుకున్న వాహనాలకు ఏ తేదీన, ఎక్కడ తీసుకెళ్లాలో కూడా స్పష్టంగా పేర్కొనాలని చెప్పారు. ఇతర వాహనాలను ఎంత మాత్రమూ అనుమతించకూడదని చెప్పారు. ఇసుక కోసం రిజిస్టర్ చేసిన వాహనాలనే వినియోగించాలని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాకు సంబంధించి అమరావతి సీడ్‌యాక్సిస్ రోడ్డులోనూ, ఎన్‌టిఆర్ జిల్లాలో నందిగామ వద్ద పెద్దఎత్తున లారీలు, ట్రక్కులు గంటల తరబడి వేచి ఉంటున్నట్లు గమనించామని, అలాంటి పరిస్థితులు లేకుండా చూడాలని ఆ రెండు జిల్లాల కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఇసుక రీచ్ల నిర్వహణ, రవాణా, ధరల నిర్ధారణ అంశాలకు సంబంధించి కొన్ని గ్యాప్‌లు ఉన్నాయని, వాటిని క్రమబద్ధీకరించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.. ఈ సమావేశంలో ఆర్థికశాఖ కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణ, భూగర్భ గనులశాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఉత్తరాంధ్ర నేతలతో కలిసి మర్యాద పూర్వకంగా జగన్‌ను కలిసిన బొత్స

ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ప్రమాణం

- జగన్ అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తన ఛాంబర్‌లో బొత్సతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కన్నబాబు, ఎంపి వైవి సుబ్బారెడ్డి, శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, సంయుక్త కార్యదర్శి ఎం విజయరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ నమ్మకం పెట్టి తనకు ఈ అవకాశం ఇచ్చారన్నారు. శాసనసభ, శాసనమండలిలో రాష్ట్ర ప్రజల కోసం నిలబడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఇష్టానుసారంగా కేసులు పెడుతున్నారని, తప్పు లేనప్పుడు తామెందుకు భయపడతామన్నారు. అంతకముందు వైఎస్ జగన్‌ను బొత్స తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన్ను జగన్ అభినందించారు.



రజకులకు సామాజిక రక్షణ చట్టం

- మంత్రి సవితకు రజక వృత్తిదారుల సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవితను ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కోరింది. మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, నాయకులు వినతిపత్రం అందజేశారు. రజకులపై జరుగుతున్న సామాజిక దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, సాంఘిక గ్రామ బహిష్కరణ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. రజక అభివృద్ధి-సంక్షేమ కార్పొరేషన్‌కు విధి విధానాలు రూపొందించి బడ్జెట్ కేటాయించాలని కోరారు. బిసి తరగతులకు రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని, 50 ఏళ్లు నిండిన ప్రతి వృత్తిదారునికి పింఛను మంజూరు చేస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు. హామీల అమలుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని వారికి మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఆ సంఘం కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, నాయకులు బొజ్జ సుబ్బారావు, దావులూరి శ్రీనివాసరావు, నూతక్కి నాగేశ్వరరావు, మోర్తోట సుబ్బారావు తదితరులు ఉన్నారు.

కడప జిల్లా వైసిపి అధ్యక్షులుగా పి రవీంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప జిల్లా జిల్లా పరిషత్ ఛైర్మన్ అభ్యర్థిగా బ్రహ్మంగారి మఠం జడ్‌పిటిసి రామగోవింద్‌రెడ్డిని వైసిపి ప్రకటించింది. అలాగే కడప జిల్లా వైసిపి అధ్యక్షులుగా కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లాకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని నియమించింది. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో కడప, అన్నమయ్య జిల్లాల వైసిపి నాయకులతో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం మేరకు వారి పేర్లను జగన్ ప్రకటించారు. అలాగే కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పి నరేన్ రామాంజులరెడ్డిని నియమించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : అనగాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను అనగాని, జవహర్ స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో ఆన్‌లైన్‌లో పేర్లు మార్చి గత పాలకులు ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

జగన్, విజయసాయిరెడ్డిల విచారణపై జాప్యమెందుకు? : వర్ల

మాజీ సిఎం వైఎస్ జగన్, ఎంపి విజయసాయిరెడ్డిలపై విచారణ ఎందుకు జరగడం లేదని, కోర్టులకు ఎందుకు హాజరుకావడం లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఉన్న కేజ్రీవాల్ జైల్లో ఉన్నారని, కేసులున్నా జగన్ ఎందుకు బయట ఉన్నారని ప్రశ్నించారు. 12 ఏళ్ల పాటు వీరిపై విచారణ జరపకపోవడంలో అర్థమేంటన్నారు.

'అనంత', శ్రీశైలంలో కుండపోత

- ఉరుములు, మెరుపులతో బీభత్సం
- విరిగిపడిన కొండచరియలు

ప్రజాశక్తి - శ్రీశైలం/ప్రాజెక్టు

అనంతపురంలోనూ నంద్యాల జిల్లా శ్రీశైలంలోనూ కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు దంచికొట్టింది. లోతట్టు కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో ఆహార దినుసులు, వస్త్రాలు, ఇంట్లోని వస్తువులు తడిచిపోయాయి. కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి.

శ్రీశైలం మండలంలో 130.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. శ్రీశైల క్షేత్రంలోని కొత్తపేట, శ్రీగిరి కాలనీలోని దాదాపు 40 ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. బియ్యం బస్తాలు, దుస్తులు, ఆహార దినుసులు పూర్తిగా తడిసిపోయాయి.

శ్రీశైలం పాతాళగంగ వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. రాత్రి సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి శ్రీశైలం–హైదరాబాద్ ఘాట్‌రోడ్డులో పెద్దపెద్ద బండరాళ్లు విరిగిపడ్డాయి. వాహనదారులు శ్రీశైలం డ్యామ్ ఘాట్ రోడ్‌లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. వర్షాలకు నష్టపోయిన నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం నాయకులు కోరారు.



శ్రీశైలంలో రహదారి పై విరిగిపడ్డ కొండ చరియలు

అనంతపురం 48వ డివిజన్ సోమనాథ్ నగర్‌తో పాటు పలు కాలనీల్లో డ్రెయినేజీలు ఉప్పొంగి ప్రవహించడంతో లోతట్టు నివాసాల్లోకి వర్షపు నీరు చేరింది. పామిడి – కల్లూరు రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుత్తిలోని లోతట్టు ప్రాంతాలు, వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం, మండల వ్యవసాయ అధికారి కార్యాలయం, ఐసిడిఎస్, వెలుగు, అటవీ శాఖ, సబ్ రిజిస్ట్రార్, పురపాలక సంఘ కార్యాలయాలతో పాటు సిపిఎం కార్యాలయం, ప్రభుత్వ బాలుర వసతిగృహం నీట మునిగాయి. 60.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రాయదుర్గంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ఇళ్లు, దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. ఆహార ధాన్యాలు, గార్మెంట్ ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాలు తడిచిపోయాయి. కణేకల్ మండలం హనకనహాల్ గ్రామం వాగులో ఓ ట్రిప్పర్ చిక్కుకుపోయింది. బొమ్మనహాల్ మండలంలోని పలు గ్రామాల్లోని వంకలు, వాగులు ఉధృతంగా ప్రవహించాయి.

నేటి నుంచి డిగ్రీ రెండో దశ అడ్మిషన్లు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

డిగ్రీ రెండో దశ అడ్మిషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ బుధవారం విడుదల చేశారు. విద్యార్థుల రిజిస్ట్రేషన్ 22 నుంచి 24వ తేదీ వరకు జరగనుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 23, 24, 25 తేదీల్లో ఉంటుంది. వెబ్ ఆప్షన్లు 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆప్షన్ల మార్పు 26వ తేదీన ఉంటుంది. 29వ తేదీన సీట్ల కేటాయింపు చేస్తారు. సెప్టెంబరు 3 వరకు కళాశాలల్లో విద్యార్థులు చేరొచ్చు.

ఇఇ, డిఇ, ఎఇ పై సస్పెన్షన్ వేటు

- అవినీతికి అడ్డాగా భద్రగిరి ఇంజనీరింగ్ కార్యాలయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

అవినీతి ఆరోపణల నేపథ్యంలో పార్వతీపురం ఐటిడిఎ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతేశ్వరరావు, గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి ఇంజనీరింగ్ కార్యాలయ డిఇ సింహాచలం, ఎఇ శ్యాం ప్రసాద్ బుధవారం సస్పెండ్ అయ్యారు. భద్రగిరి ఇంజనీరింగ్ పరిధిలో 2021లో పనులు జరగకుండా జరిగినట్లు రికార్డుల్లో చూపించి ఫోర్జరీ సంతకాలతో లక్షలాది రూపాయలు బిల్లులు డ్రా చేసినట్లు విచారణలో తేలడంతో అధికారుల అవినీతి బాగోతం బయటపడింది. గతంలో ఇక్కడ పనిచేసిన డిఇ, ఐటిడిఎ ఇన్‌ఛార్జి ఇఇ మోహన్ రావు అవినీతి ఆరోపణలపై ఎసిబి అధికారులకు చిక్కారు. భద్రగిరి ఇంజనీరింగ్ సెక్షన్‌లో పలు అక్రమాలు జరిగాయని ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. భద్రగిరి ఏజెన్సీ ప్రాంతం కావడం, మారుమూల గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులపై ఉన్నత స్థాయి అధికారులు పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడంతో అధికారులు అవినీతికి పాల్పడ్డారు.

చిన్నారిపై వృద్ధుడి లైంగిక దాడి

ప్రజాశక్తి –కోటవురట్ల (అనకాపల్లి జిల్లా)

మూడేళ్ల చిన్నారిపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములవాక గ్రామంలోని దళిత కాలనీకి చెందిన మూడేళ్ల చిన్నారి ఆడుకునేందుకు బయటకు వెళ్లింది. ఆ సమీపంలోనే నివసిస్తున్న కోట పాములు (65) బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆడుకునేందుకు వెళ్లిన చిన్నారి ఇంటికి గాయాలతో ఏడుస్తూ రావడంతో తల్లి గమనించి బాలికను ప్రశ్నించడంతో విషయం తెలిపింది. శరీరంపై గాయాలు ఉండటాన్ని గమనించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లింది. బాలిక తల్లి ఫిర్యాదుతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'అపోలో' విద్యార్థినుల అస్వస్థత

వాంతులు, విరోచనాలతో ఆస్పత్రిపాలు

ప్రజాశక్తి– చిత్తూరు అర్బన్

చిత్తూరు అపోలో మెడికల్ యూనివర్సిటీ, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి నుంచి ఒకరి తరువాత ఒకరు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న యాజమాన్యం వారిని చిత్తూరు ప్రభుత్వ, జిల్లా ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతున్న విద్యార్థినులను డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ప్రభావతి పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎటువంటి ప్రమాదమూ లేదని తెలిపారు. మెడికల్ హాస్టల్‌ను, కళాశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని తమ పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బర్త్‌డే ఫంక్షన్‌కు వెళ్లిన 25 మంది విద్యార్థినులు మాత్రమే అస్వస్థతకు గురయ్యారని యాజమాన్యం చెబుతుండగా సహచర విద్యార్థినులు మాత్రం దీనిని ఖండించారు. ఫంక్షన్‌కు వెళ్లలేదని, క్యాంపస్‌లోనే ఆహారం తీసుకున్నామని పేర్కొన్నారు. క్యాంటీన్‌లో తిన్న ఆహారం ఫుడ్‌పాయిజన్ కావడంతోనే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. క్యాంపస్‌లో మొత్తం 1200 మంది విద్యార్థినులు ఉన్నారు. ఈ ఘటనపై అపోలో యాజమాన్యం సమాధానం చెప్పాలని సిపిఎం, సిపిఐ నాయకులు, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఫుడ్‌పాయిజన్‌కు కారణాలను తెలియజేయడంతో పాటు, అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



చిత్తూరు ప్రభుత్వ ఆస్పతిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

శాశ్వత ప్రాతిపదికన లెక్చరర్ల పోస్టులు

- మంత్రి లోకేష్‌కు డివైఎఫ్ఐ లేఖ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. గెస్ట్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయొద్దని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి రామన్న, వై రాము బుధవారం లేఖ రాశారు. రాష్ట్రంలో జూనియర్ కళాశాలల పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా తయారవుతోందని విమర్శించారు. ఖాళీ పోస్టులను కొన్నేళ్లుగా భర్తీ చేయడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వానికి భిన్నంగా నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆశించామని, కానీ గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించడం అన్యాయమని తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీ పేరుతో శ్రమ దోపిడీకి శ్రీకారం చుట్టిందని విమర్శించారు. నెలకు రూ.10 వేలు వేతనం ఏమిటని? దీనిపై ఆలోచించాలన్నారు. ఈ కళాశాలల్లో 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న 3,619 మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు, నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. కళాశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు.

జలాశయాల పట్ల జగన్ నిర్లక్ష్యం : ఆనం

ప్రజాశక్తి–నెల్లూరు :

నీటిపారుదల శాఖపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సరైన అవగాహన లేనికారణంగా రాష్ట్రంలోని జలాశయాల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వ్యవహరించారని, ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే జిల్లాలోని సోమశిల జలాశయం భద్రతపై సిఎం దృష్టి సారించడం సంతోషకరమన్నారు. అందులో భాగంగానే ఆ జలాశయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు ఆకస్మికంగా పరిశీలించారన్నారు. త్వరలో సోమశిల జలాశయ మరమ్మతుల పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. సోమశిల నుంచి కండలేరుకు నీరు అందించే హెడ్ రెగ్యులేటర్ మరమ్మతుల కోసం రూ.ఐదు కోట్లను మంజూరు చేశారన్నారు. క్రస్టు గేట్లతో పాటు ఇతర మరమ్మతులకు నిధులను విడుదల చేస్తామని చెప్పారు. కండలేరులో నీరు లేకపోవడంతో సోమశిల నుంచి రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఆనం సంజీవరెడ్డి హై లెవెల్ కెనాల్ పనులు చేపట్టి పడమటి నాయుడుపల్లి, పొంగూరు రిజర్వాయర్లను పూర్తి చేసి మెట్ట ప్రాంతంలోని 20,000 ఎకరాలకు ఈ ఏడాది సాగునీరు అందించాలని అధికారులను సిఎం ఆదేశించారని తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు రూరల్, కావలి ఎంఎల్ఎలుకోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విమానాశ్రయం కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి– కొత్తపట్నం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో విమానాశ్రయం కోసం కేటాయించిన స్థలాన్ని ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని అల్లూరు, ఆలూరు గ్రామాల్లో గతంలో వాన్‌పిక్ స్థలం నుంచి సుమారు 570 ఎకరాల భూమిని విమానాశ్రయం కోసం కేటాయించారు. అల్లూరు గ్రామంలో 1700 నుంచి 1800 సర్వే నంబర్లలో 450 ఎకరాలు, ఆలూరు గ్రామంలో 500 నుంచి 600 సర్వే నంబర్లలో 77 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులతో కలిసి జెసి సందర్శించారు. భూములకు సంబంధించిన మ్యాపును పరిశీలించారు. ఈ భూముల్లో సుమారు 450 ఎకరాల ప్రభుత్వ భూమి, 80 ఎకరాల పట్టా భూములు ఉన్నట్లు జెసికి రెవెన్యూ అధికారులు వివరించారు. త్వరలో ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో జెసి భూములు పరిశీలించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన వెంట ఒంగోలు ఆర్‌డిఒ సుబ్బారెడ్డి, కొత్తపట్నం తహశీల్దారు మధుసూదన్ రావు, డిప్యూటీ తహశీల్దారు అర్జున్ రెడ్డి, ఆర్ఐ వర కుమార్, మండల సర్వేయర్ సుధీర్ బాబు, విఆర్‌ఒలు ప్రవీణ్, సురేష్, సర్వేయర్లు ఉన్నారు.

ఉచిత విద్యుత్‌కు చేనేత కార్మికులు దరఖాస్తు

- చేనేత కార్మిక సంఘం సూచన

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె వెంకటేశ్వరరావు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో బుధవారం విలేకర్లతో వారు మాట్లాడారు. చేనేత కార్మికులకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఎనిమిదేళ్ల నుండి ఆందోళనలు చేసిన నేపథ్యంలో 2018లో సిఎంగా చంద్రబాబు వంద యూనిట్లకు జిఒ ఇచ్చారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. తాజాగా అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వానికి పలు డిమాండ్లతో విన్నవించామని, చేనేత మంత్రి సవితకు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రాలు అందించామని తెలిపారు.

విశాఖను వైసిపి నేతలు దోచుకున్నారు

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి–ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రానికి పరిశ్రమల రాకుండా గత వైసిపి ప్రభుత్వం అడ్డుకుందని, పారిశ్రామికవేత్తలను జగన్ బెదిరించారని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. గత ఐదేళ్లలో విశాఖను వైసిపి నేతలు అడ్డగోలుగా దోచుకున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం హిల్ టాప్ గెస్ట్‌హౌస్‌లో విశాఖ ఉక్కు సిఎండి అతుల్ భట్‌తోపాటు పలువురు డైరెక్టర్లను కలుసుకున్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ –3ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ప్లాంట్ ఎదుర్కొంటున్న ముడిసరకు సమస్యను గుర్తింపు యూనియన్ నాయకులు ఆయనకు వివరించారు. ప్లాంట్‌లో మూడు ఫర్నేస్‌లు ఉండగా ప్రస్తుతం ఒక్కదానినే నడుపుతున్నారని, కేంద్రం విధించిన ఆంక్షల కారణంగా కోకింగ్ కోల్స్, ఐరన్ ఓర్ దిగుమతులపై ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్లాంట్‌కు పూర్వవైభవం వచ్చేలా చేయాలని కోరారు. రాష్ట్రంలోని గనులను స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సరిపల్లి గర్భాం మ్యాంగనీస్ లీజును పొడిగించినందుకు కార్మిక సంఘాల తరపున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. అన్ని రకాలుగా స్టీల్‌ప్లాంట్‌ను మూసివేయడానికి ప్రయత్నం చేశారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని చెప్తూనే గనులు రాకుండా చేశారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌కు అన్ని వసతులూ కల్పిస్తామని హామీ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ సందర్శనకు ముందు సింహాచలం దేవస్థానాన్ని మంత్రి కొల్లు సందర్శించారు.

శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, వేద పండితులు స్వాగతం పలికారు.



విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ పర్నేస్‌ను సందర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర

ఇ-కామర్స్ వృద్ధితో ప్రమాదం

- ఉపాధిపై తీవ్ర ప్రభావం
- సామాజిక అంతరాలకు దారి తీయొచ్చు
- మంత్రి పీయూష్ గోయల్ ఆందోళన



న్యూఢిల్లీ : ఒకప్పుడు ఇ-కామర్స్ కంపెనీలకు ఇష్టానుసారంగా అనుమతులు మంజూరు చేసి వాటిని నెత్తిన పెట్టుకున్న బిజెపి ప్రభుత్వం.. ఇప్పుడు వాటి ప్రమాదం గురించి ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇ-కామర్స్ సంస్థలు వేగంగా వృద్ధి చెందడంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఈ రంగం పెరుగుదలపై గర్వపడాల్సిన దానికంటే ఆందోళన కలిగించే అంశంగానే చూడాలన్నారు.

'భారత్‌లో ఉపాధి కల్పన –వినియోగదారుల సంక్షేమంపై ఇ-కామర్స్ ప్రభావం' అనే రిపోర్ట్‌ను బుధవారం మంత్రి పీయూష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ రంగం ఉపాధి, వినియోగదారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా సంస్థలు పుట్టుకొస్తుండటాన్ని గొప్ప విజయంగా భావించకూడదని, ఇది ఆందోళన చెందాల్సిన విషయమని అన్నారు. ఇ-కామర్స్ సంస్థల వృద్ధి సామాజిక అంతరాలకు దారి తీయనుందన్నారు.

బడా ఇ-కామర్స్ పెట్టుబడి వ్యూహాలపై మంత్రి విమర్శలు చేశారు. పెద్ద సంస్థలు వేల కోట్ల రూపాయలు భారత్‌లో పెట్టుబడిగా పెడుతున్నామని ప్రకటించగానే మనందరం సంతోషంగా ఉత్సవం చేసుకుంటామన్నారు. వాస్తవంగా ఆ పెట్టుబడులు భారత్ కోసం కాదన్నారు. ఆయా సంస్థలు తమ బ్యాలెన్స్ షీట్‌లోని నష్టాలను భర్తీకి ఆ మొత్తాలను వినియోగిస్తున్నాయని పేర్కొన్నారు. తమపై ఎవరూ న్యాయ పోరాటానికి దిగకుండా పెద్ద పెద్ద లాయర్లకు కోట్లాది రూపాయలు ఈ సంస్థలు వెచ్చిస్తుంటాయని వెల్లడించారు. ఒక ఏడాదిలో రూ.6 వేల కోట్ల నష్టం వచ్చిందీ అంటే.. అది పోటీని తప్పించే ధరల విధానం కాకుండా మరేంటి? మరి ఆ నష్టాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. వాస్తవానికి ఇ-కామర్స్ సంస్థలు బిజినెస్ టు కస్టమర్ వ్యాపారాన్ని (బి2సి) నిర్వహించకూడదన్నారు. కానీ ఇప్పుడు ప్రజలందరూ అవే వేదికలపై కొనుగోళ్లు చేస్తున్నారన్నారు.

చిల్లర వ్యాపారులకు దెబ్బ

వచ్చే పదేళ్ల తర్వాత ఇ-కామర్స్ వృద్ధితో రిటైల్ మార్కెట్ సగాన్ని ఆక్రమిస్తుందని.. ఇది ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. అది ఆందోళన కలిగించే విషయం అన్నారు. ఆర్థిక వ్యవస్థలో ఇ-కామర్స్‌కు స్థానం ఉన్నప్పటికీ దాని ప్రభావాన్ని జాగ్రత్తగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇ-కామర్స్ సంస్థలు అనుసరిస్తున్న ధరల విధానం వల్ల సంప్రదాయ రిటైల్ వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా ధరల విధానం దేశానికి మంచిది కాదన్నారు. ఇ-కామర్స్ వేగంగా పెరగడం చిన్న వ్యాపారుల వ్యాపారాన్ని దెబ్బతీయడమే కాకుండా వారిని మార్కెట్ నుంచి తరిమికొట్టే అవకాశం ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

మరో విద్యార్థికి గాయాలు

కేబుల్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో ఘటన

ప్రజాశక్తి–కడప (వైఎస్ఆర్ జిల్లా)

సైకిల్‌పై వెళుతూ విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఓ బాలుడు మృతి చెందాడు. మరొక బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన కడప నగరంలోని బెల్లం మండి వీధిలో ఇంటర్నేషనల్ కల్యాణ మండపం (టైటానిక్ బిల్డింగ్) వద్ద బుధవారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. బెల్లం మండి వీధికి చెందిన అబ్దుల్ రహిమాన్ పెద్ద కుమారుడు బురేషి తంజువుర్ రహిమాన్ (11), అజ్మత్ అలీ కుమారుడు షేక్ ఆద్నాం అనే విద్యార్థులు ఇంటి సమీపంలోని విద్యాసాగర్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ రోజూ సైకిల్‌పై పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం సైకిల్‌పై వారిద్దరూ పాఠశాలకు బయలుదేరారు.

టైటానిక్ బిల్డింగ్ సమీపంలోకి రాగానే రోడ్డుపై తెగిపడిన కేబుల్ వైరు సైకిల్ వెనుక చక్రానికి తగిలింది. ఆ కేబుల్ జివి వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై మంటలు రేగాయి. దీంతో ఇద్దరూ కిందపడి గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు స్పందించి చెక్కతో విద్యార్థులను పక్కకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రహిమాన్ మృతిచెందాడు. హోలిస్టిక్ ఆస్పత్రిలో ఆదాం చికిత్స పొందుతున్నాడు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవి, విద్యుత్ ఎస్ఇ రమణ, డిఇఒ అనురాధ సంఘటనా స్థలాన్ని పరిశీలించి సంఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించామన్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్య సేవలందించాలని అధికారులను ఆదేశించారు. బాలుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.



మృతిచెందిన రహిమాన్



శుభకార్యానికి వెళ్లి వస్తుండగా... రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్

అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొందలదిన్నె వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... తాడిపత్రి మండల పరిధి గదరగుట్టపల్లి గ్రామాల్లో నివాసం ఉంటున్న ప్రతాప్ రెడ్డి (24) ఆయన భార్య ప్రమీల (21), ప్రమీల అమ్మ వెంకటలక్ష్మి (47) కలిసి కడప జిల్లా వేంపల్లి గ్రామంలోని తమ బంధువుల కేశఖండన కార్యక్రమానికి కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామ సమీపంలోకి వచ్చే సరికి కారును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రతాప్‌రెడ్డి, ప్రమీల అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన వెంకటలక్ష్మిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. లారీ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టడం వల్లే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐసిఐసిఐ లాంబార్డ్ నుంచి 'ఎలివేట్' ప్లాన్

ప్రజాశక్తి - హైదరాబాద్



ప్రయివేటు రంగంలోని జనరల్ బీమా కంపెనీ ఐసిఐసిఐ లాంబార్డ్ తాజాగా వినూత్న ఆరోగ్య బీమా ఉత్పత్తి 'ఎలివేట్'ను ప్రారంభించినట్లు ప్రకటించింది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐసిఐసిఐ లాంబార్డ్ హెల్త్ ఎజెన్సీ మెడ్ వివేక్ శ్రీవాస్తవ్ మాట్లాడుతూ.. ఎఐ ఆధారిత డిజైన్ చేసిన ఈ వైద్య బీమా అత్యాధునిక ఫీచర్లు, యాడ్–ఆన్‌లను కలిగి ఉందన్నారు. డైనమిక్ జీవనశైలి, ఊహించని వైద్య అత్యవసర పరిస్థితులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం అవసరాలను తీర్చడానికి వ్యక్తిగతీకరించిన పరిష్కారాలను అందిస్తోందన్నారు. వైద్య, మోటార్ బీమా 2015 నుంచి ప్రతీ ఏడాది సగటున 13 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. 2023–24లో రూ.2.89 లక్షల కోట్ల వ్యాపారం నమోదు చేయగా.. ప్రస్తుత ఏడాదిలో రూ.3 లక్షల కోట్లకు చేరనుందని అంచనా వేశారు. హైదరాబాద్‌లో 300 ఆసుపత్రులతో తాము భాగస్వామ్యం కలిగి ఉన్నామన్నారు.

అత్యుత్తమ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా శక్తికాంత



న్యూఢిలీ : ప్రపంచంలోనే అత్యుత్తమ సెంట్రల్ బ్యాంకర్‌గా వరుసగా రెండోసారి ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఎన్నికయ్యారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఇచ్చిన ర్యాంకుల్లో దాస్‌కు మరోమారు ఒక్కటో స్థానం దక్కింది. ఈ ఏడాది దాస్‌కు ఏ ప్లస్ రేటింగ్ లభించిందని ఆర్‌బిఐ ఎక్స్‌లో తెలిపింది. ఏ ప్లస్ రేటింగ్‌ను ముగ్గురు సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌లకు ఇవ్వగా.. అందులో దాస్ అగ్రస్థానం పొందారని పేర్కొంది. శక్తికాంత దాస్‌తో పాటు డెన్మార్క్‌కు చెందిన క్రిస్టియన్ కెటెల్ థామ్సన్, స్విట్జర్లాండ్ గవర్నర్ థామస్ జె జోర్డాన్ ఏ ప్లస్ రేటింగ్‌ను సాధించిన వారిలో ఉన్నారు.

ఎఫ్‌డిలపై ఐడిబిఐ బ్యాంక్ వడ్డీ రేట్ల పెంపు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఐడిబిఐ బ్యాంక్ ఫిక్సుడ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచినట్లు ప్రకటించింది. 444 రోజుల కాలవ్యవధి డిపాజిట్లపై గరిష్ఠంగా 7.85 శాతం వడ్డీ చెల్లిస్తామని ఆ సంస్థ పేర్కొంది. 375 రోజుల ఎఫ్‌డిలపై 7.75 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. 700 రోజుల కాలవ్యవధిపై 7.70 శాతం, 300 రోజుల ఎఫ్‌డీపై 7.55 శాతం వడ్డీ చెల్లిస్తామని పేర్కొంది. సెప్టెంబర్ 30 వరకు పెరిగిన వడ్డీ రేట్లు అందుబాటులో ఉంటాయని బ్యాంక్ తెలిపింది.



టాటా మోటార్స్ నుంచి 250 ఛార్జింగ్ స్టేషన్లు

- పలు సంస్థలతో ఒప్పందం

ముంబయి : టాటా మోటార్స్ కొత్తగా 250 ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు గాను డెల్టా ఎలక్ట్రానిక్స్, థండర్‌ప్లస్ సొల్యూషన్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో తన ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాల కోసం ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. బెంగళూరు, ఢిల్లీ, ముంబయి, చెన్నయ్, పూణే, కొచ్చి తదితర ఇతర నగరాలతో సహా 50 కంటే ఎక్కువ నగరాల్లో ఈ అదనపు ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. వీటితో 540 వాణిజ్య వాహనాల ఛార్జింగ్ పాయింట్ల నెట్‌వర్క్‌కు విస్తరించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. డెల్టా ఎలక్ట్రానిక్స్ అవసరమైన హార్డ్‌వేర్‌ను సరఫరా చేస్తుంది, థండర్‌ప్లస్ సొల్యూషన్స్ వాటిని ఇన్‌స్టాల్ చేయడంతో పాటు ఆపరేట్ చేస్తుంది.

సంపాదకీయం


తిరోగమన చర్య

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా ఉంది పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తాజా చర్య! కోల్‌కతాలోని ఆర్‌జి కార్ ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్‌పై జరిగిన అమానుష కాండ గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆగస్టు తొమ్మిదవ తేదీన ఆ దారుణం జరిగినప్పటికీ ఇంత వరకు నేరస్తులెవరో తేలలేదు. మరోవైపు దేశ వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రమౌతున్నాయి. దేశ అత్యున్నత న్యాయస్థానం సూమోటోగా ఈ కేసును విచారణకు తీసుకుంది. విచారణ ప్రారంభించిన మొదటి రోజే 'మరో అత్యాచారమో...హత్యో జరిగేంతవరకు చూస్తూ ఊరుకోవాలా..?' అని ప్రశ్నించింది. ఈ పరిణామాలన్నీ మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టాయి. దీంతో నష్ట నివారణ చర్యల్లో భాగంగా మహిళల పనిగంటలు తగ్గించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'సాధ్యమైనంత వరకు మహిళలకు రాత్రి డ్యూటీని నివారించాలి' అని మార్గదర్శకాలను జారీ చేసింది. భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నప్పటికీ ఆచరణలో ఇది మహిళల ఉపాధి అవకాశాలపై గొడ్డలి వేటుగా మారనుంది. మహిళలకు అరకొరగా ఉన్న ఉపాధి అవకాశాలను సైతం ఈ నిర్ణయం గండి కొడుతుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అందుకే, మమతా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తిరోగమన చర్య. మభ్య పెట్టే ఈ తరహా విధానాలకు బదులు అసలైన రక్షణ చర్యలు తీసుకోవాలి.

నయా ఉదారవాద, ఆర్థిక విధానాల ఫలితంగా కుటుంబంలోని భార్య, భర్త ఇద్దరూ పనిచేస్తే తప్ప పూట గడవని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అనివార్యంగా మహిళలు కూడా ఏదో ఒక పనిచేయాల్సి వస్తోంది. కోల్‌కతా వంటి మహానగరంలో వైద్య ఆరోగ్య రంగంతో పాటు, గిగ్ వర్కర్లు, ఫ్యాక్టరీలు, కాల్ సెంటర్లు, హోటళ్లు, పారిశుధ్య కార్మికులుగా లక్షలాది మంది మహిళలు పనిచేస్తున్నారు. ఆటో డ్రైవర్లు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. విధి నిర్వహణలో భాగంగా పురుషులతో సమానంగా రాత్రి పూట కూడా వీరు పనుల్లో భాగస్వాములవుతున్నారు. 'ఎక్కడైనా..ఎప్పుడైనా' వీరందరికి సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆ పని చేయడానికి బదులుగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చేతులెత్తేస్తోంది. మరో విధంగా చెప్పాలంటే మహిళలు ఇళ్లనుండి బయటకొచ్చి రాత్రిపూట పనిచేస్తున్నారు కాబట్టే, అత్యాచారాలు జరుగుతున్నాయన్నట్టుగా వ్యవహరిస్తోంది. ఇది ఒక రకంగా సంఘ్‌పరివార్ వాదనే! ఈ నిర్ణయంతో మహిళల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా కుదించుకుపోతాయి. అంతిమంగా శ్రామిక శక్తి నుండి మహిళలను దూరం చేస్తుంది. అదే సమయంలో వేధింపులు, అత్యాచారాల నుండి మహిళలకు లభించే భద్రత మాత్రం ప్రశ్నార్థకమే! పగటి పూట వేధింపులు జరగవన్న గ్యారంటీ ఏమిటి? రాత్రి పూట ఇళ్ళ వద్ద ఉన్నా భద్రత ఉంటుందన్న నమ్మకం ఏమిటి?

మహిళలు రాత్రి పూట పనిచేయడంపై చర్చ ఇప్పటిది కాదు. స్వాతంత్ర్యానికి పూర్వమే రామ్ చంద్ వర్సెస్ మథురా చంద్ కేసులో న్యాయస్థానం భద్రత సాకుతో మహిళలను నైట్‌డ్యూటీల నుండి దూరం పెట్టడాన్ని తప్పు పట్టింది. స్వాతంత్ర్యం తరువాత కూడా అత్యున్నత న్యాయస్థానం ఇదే స్ఫూర్తిని కొనసాగించింది. కె.ఎస్ త్రివేణి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఆర్ వసంత వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను అత్యున్నత న్యాయస్థానం ప్రస్తావించింది. ఎటువంటి వివక్షా లేని సమానత్వాన్ని ఆర్టికల్ 14 దేశ ప్రజలందరికీ దఖలు పరుస్తోందని స్పష్టం చేసింది. ఫ్యాక్టరీస్ యాక్ట్‌లో దీనికి భిన్నంగా ఉన్న నిబంధనలను కొట్టివేసింది. ఈ తీర్పుల స్ఫూర్తితో పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు (నివారణ, నిషేధం, పరిహారం) చట్టం 2013, లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 రూపొందాయి. ఇప్పటికీ వీటి అమలు అంతంత మాత్రమే! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాల మేరకైనా భద్రతా చర్యలను తక్షణం అమలుచేయాలి. అమలు చేయని సంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళలపట్ల హింసకు, దౌర్జన్యాలకు, లైంగిక వేధింపులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించాలి.

మహనీయుల మాట



మన భవిష్యత్తుకు
మనమే రూపు రేఖలు దిద్దుకోవాలి.
- విలియం షేక్‌స్పియర్,
ప్రపంచ ప్రసిద్ధ నాటక రచయిత.

William Shakspere

గ్రామాల నుండి తరలిపోతున్న యువత

విశ్లేషణ

గ్రామాల్లో నివసిస్తున్న యువతలో 70 నుండి 85 శాతం మంది ప్రస్తుతం చేస్తున్న పనుల నుండి దూరం కావాలని కోరుకుంటున్నట్లు "స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయ్‌మెంట్ రిపోర్టు 2024" తెలిపింది. దేశంలోని 21 రాష్ట్రాల్లో మూడు సంస్థలకు చెందిన నిపుణులు వేలాది యువతను సర్వే చేసి వారి అభిప్రాయాల ఆధారంగా ఈ రిపోర్టును ప్రకటించారు. వ్యవసాయం తమ భవిష్యత్ గ్యారంటీ కాదని గ్రామీణ యువత భావిస్తున్నది. వ్యవసాయం, గ్రామీణ స్వయం ఉపాధి రంగాల్లో పని చేయడానికి దేశ యువత సుముఖంగా లేరు. పట్టణాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు లేదా చిన్న వ్యాపారాలు చేసుకోవాలని యువకుల్లో 90 శాతం, యువతుల్లో 50 శాతం మంది భావిస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో గ్రామాల నుండి వెళ్లిపోవడానికి లేదా వ్యవసాయం నుండి దూరం కావడానికి యువత ఎందుకు సిద్ధపడుతున్నారనే ఆందోళన మన పాలకులకు లేదు. వారి భవిష్యత్‌కు గ్రామంలో గ్యారంటీ ఇవ్వడానికి మన పాలకులకు శ్రద్ధ లేదు. అలా వుండి వుంటే ఈ సర్వేను తీవ్రంగా పరిగణించి, పరిష్కార చర్యలు వెంటనే చేపట్టి వుండేవారు. కానీ మన పాలకులు నిర్లక్ష్యంలో నీరో చక్రవర్తికి, మాటల్లో ఉత్తమ కుమారునికి వారసులు.



వి. రాంభూపాల్

ప్రపంచబ్యాంకు అభివృద్ధి 2024 లెక్కల ప్రకారం దేశ జనాభాలో 63.64 శాతం మంది గ్రామాల్లో నివసిస్తున్నారు. వీరిలో 20-30 సంవత్సరాల మధ్య వయసు గల యువత 68 శాతం మంది వున్నారు. 18 నుండి 35 సంవత్సరాల లోపు వున్న గ్రామీణ యువకుల్లో 77.1 శాతం మంది, యువతుల్లో 66.2 శాతం మంది స్థానికంగా దొరుకుతున్న పనులతో ప్రస్తుతం ఉపాధి పొందుతున్నారు. అయితే యువకుల్లో 82 శాతం మంది, ముఖ్యంగా 18-25 సంవత్సరాల యువకుల్లో 84.7 శాతం మంది, అలాగే యువతుల్లో 72 శాతం మంది, అందులో 18-25 మధ్య వయస్కులలో 74.2 శాతం మంది ప్రస్తుతం చేస్తున్న పనుల్లో కొనసాగడానికి ఇష్టపడడం లేదని ఈ సర్వే తెలిపింది. దీనికి ప్రధాన కారణాలు వ్యవసాయ దిగుబడులు ఏడాదికేడాది తగ్గిపోతున్నాయని 68 శాతం మంది, తమ కుటుంబాన్ని పోషించు కోవడానికి అవసరమైనంత భూమి లేదని 46 శాతం మంది, కుటుంబ అవసరాలకు సరిపడ ఆదాయం వ్యవసాయం నుండి రావడం లేదని 63 శాతం మంది యువత అభిప్రాయపడినట్లు ఈ నివేదిక ప్రకటించింది. తరతరాలుగా వెంటా డుతున్న సామాజిక వివక్ష కూడా గ్రామాల నుండి యువత వెళ్లిపోవాలనుకోవడానికి మరో ముఖ్య కారణంగా వుంది.

వ్యవసాయ రంగం నేడు ఎదుర్కొంటున్న అన్ని కష్టాలకు ప్రధాన కారణం ఆ రంగం పట్ల మన స్వదేశీ పాలకుల విధానాలే. భూ సమస్య పరిష్కరించకుండా గ్రామీణాభివృద్ధి సాధ్యం కాదని తెలిసి భూసంస్కరణలను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేశారు. భూస్వామ్య కుటుంబాల దగ్గర వున్న భూమిని పంపిణీ చేయకుండానే వారిని ఆధునిక పెట్టుబడిదారులుగా, పెద్ద వ్యాపారులుగా మార్చారు. వ్యవసాయ విధానాల పేరుతో గ్రామాల్లోని కొద్దిమందిని ధనిక రైతులుగా మార్చి...అసంఖ్యాకంగా వున్న చిన్న, సన్నకారు రైతుల, వ్యవసాయ కార్మికుల జీవితాలను మరింతగా దిగజార్చారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యంకాదు. వీటికి తోడు గిట్టుబాటు ధరలు లేకపోవడం, విద్యా వైద్యం, కుటుంబ అవసరాలు, ఆపదల లాంటి ప్రతి సందర్భంలోనూ అప్పు తప్ప మరో గత్యంతరంలేని పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటివల్ల ఒకవైపు రైతుల ఆత్మహత్యలు, మరోవైపు కూలీల వలసలు పెరిగాయి. తరతరాలుగా గ్రామాలను వెంటా డుతున్న కుల వివక్ష, సామాజిక అంతరాల దుర్భర పరిస్థితుల్లో పుట్టి పెరుగుతున్న యువత ఇదే కష్టాలను అనుభవించడానికి ఎందుకు సిద్ధ పపడతారు? అందుకే గ్రామాల నుండి యువతరం తరలిపోతున్నది. ప్రతి ముగ్గురిలో ఒకరు వలస వెళుతున్న పరిస్థితికి చేరాం.



"వ్యవసాయ విధానాల పేరుతో గ్రామాల్లోని కొద్దిమందిని ధనిక రైతులుగా మార్చి... అసంఖ్యాకంగా వున్న చిన్న, సన్నకారు రైతుల, వ్యవసాయ కార్మికుల జీవితాలను మరింతగా దిగజార్చారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదు. వీటికి తోడు గిట్టుబాటు ధరలు లేకపోవడం, విద్యా వైద్యం, కుటుంబ అవసరాలు, ఆపదల లాంటి ప్రతి సందర్భంలోనూ అప్పు తప్ప మరో గత్యంతరంలేని పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటివల్ల ఒకవైపు రైతుల ఆత్మహత్యలు, మరోవైపు కూలీల వలసలు పెరిగాయి. తరతరాలుగా గ్రామాలను వెంటాడుతున్న కుల వివక్ష, సామాజిక అంతరాల దుర్భర పరిస్థితుల్లో పుట్టి పెరుగుతున్న యువత ఇదే కష్టాలను అనుభవించడానికి ఎందుకు సిద్ధపపడతారు?"

గ్రామాల నుండి వలస వస్తున్న ఈ యువతను ఇముడ్చుకునే స్థితి మన నగరాలకు, పట్టణాలకు వుందా? అంతర్రాష్ట్ర రైళ్ళలో జనరల్ బోగీలతో పాటు రిజర్వేషన్లలో ప్రతిరోజు వేలాది యువత పనుల కోసం ఒక మూల నుండి మరో మూలకు వలసలు వెలుతున్న దృశ్యాలు చూస్తూనే వున్నాము. గ్రామాల నుండి వెలుతున్న యువత ఎక్కువ భాగం బొంబాయి, కలకత్తా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, పూణే, సూరత్ లాంటి నగరాలకు చేరుకుంటున్నారు. కేరళ, మన రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాల నుండి గల్ఫ్ దేశాలకు కూడా వలస వెళుతున్నారు. ఇలా వలస వెళ్లిన వారికి సరైన ఉపాధి అవకాశాలు, వేతనాలు, కనీస సౌకర్యాలు, కార్మిక చట్టాల లాంటివి ఏవీ అమలు కావడంలేదు. దేశ స్థూల ఆదాయం పెరుగుతుందని పాలకులు చెబుతుంటే మరోవైపు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నట్లు అనేక నివేదికలు చెబుతున్నాయి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2022 నాటికి వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో 53.4 శాతం, తయారీ రంగంలో 19.4, నిర్మాణ రంగంలో 20.5, వ్యాపారాల్లో 15.0, ఎలక్ట్రిసిటీ, గ్యాస్ వాటర్ సరఫరాలో 0.7, గనులు, క్వారీల్లో 0.5, హోటళ్ళు, రెస్టారెంట్లలో 2.7, ట్రాన్స్‌పోర్ట్ 5.6, ఐ.టి ఇతర సేవా రంగాల్లో 3.4 శాతం మంది ఉపాధి పొందుతున్నారు. 2019 నుండి 2022 నాటికి ఇదే రంగాల్లో ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గినట్లు ఇండియన్ ఎంప్లాయ్‌మెంట్ 2024 రిపోర్టు ప్రకటించింది. 22 సంవత్సరాల వయసు వున్న యువతలో 83 శాతం మంది ఉపాధి సమస్యను ఎదుర్కొంటున్నారని, ఉపాధి పొందుతున్న ఆ కొద్దిమందికి కూడా కనీస వేతనాలు అందడం లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ నివేదిక ప్రకారం రెగ్యులర్ వేతనాలు పొందుతున్న కార్మికుల్లో 57 శాతం మంది నెలకు పది వేలు, క్యాజువల్ కార్మికుల్లో 59.3 శాతం మంది ఐదు వేల నుండి ఏడున్నర వేలు మాత్రమే వేతనాలుగా పొందుతున్నారు.

గ్రామాల్లో భూ సమస్యను పాలకులు పరిష్కరించకపోవడం యువత పట్టణాలకు తరలి వెళ్లడానికి కారణమైతే, పట్టణాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమల పట్ల పాలకుల విధానాలు ఉపాధి తగ్గడానికి మరో కారణం. వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి పొందుతున్న వారిలో 74.31 శాతం మంది చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లోనే వుంటున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది వెన్నెముకగా ఈ పరిశ్రమలు ఉన్నాయి. వీటికి తగిన ప్రోత్సాహాలు, రాయితీలు ఇవ్వాల్సిన పాలకులు వీటిని దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు బలిపెడుతున్నాయి. భవన నిర్మాణం, ఆటో, టాక్సీ, ఇంటి పని, షాపు గుమస్తాలు, వాచ్‌మెన్లు లాంటి పనులకు పోటీ పెరిగి వేతనాలు తగ్గిపోతున్నాయి. పట్టణాల్లో గృహ వసతి ఒక పెద్ద సమస్యగా వుంది. విద్యా వైద్యం, పౌరసేవల నుండి ప్రభుత్వాలు తప్పుకోవడంతో పట్టణ పేదలపై భారాలు పెరుగుతున్నాయి. గ్రామీణ కష్టాల నుండి కనీస విముక్తి పొందడానికి పట్టణాలకు వచ్చిన యువతకు ఇక్కడ తగ్గుతున్న ఉపాధి అవకాశాలు, వేతనాలు వారి జీవితాలను మరింత ఛిద్రం చేస్తున్నాయి.

"గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సమస్యను పరిష్కరించకుండా, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయకుండా దేశాభివృద్ధి గురించి ఎన్ని కబుర్లు చెప్పినా అవి యువత ఆశలను నెరవేర్చలేవు. ఎన్నికల సమయంలో ప్రకటించే సంక్షేమ పథకాలు తాత్కాలికంగా ఆకలిని వాయిదా వేయగలవే కానీ, ఆకలిని తీర్చలేవు. దేశం నిజమైన స్వావలంబన సాధించాలంటే వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధికి పాలకులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అందుకు యువత ఉద్యమాలకు సిద్ధం కావాలి."

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సమస్యను పరిష్కరించకుండా, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయకుండా దేశాభివృద్ధి గురించి ఎన్ని కబుర్లు చెప్పినా అవి యువత ఆశలను నెరవేర్చలేవు. ఎన్నికల సమయంలో ప్రకటించే సంక్షేమ పథకాలు తాత్కాలికంగా ఆకలిని వాయిదా వేయగలవే కానీ, ఆకలిని తీర్చలేవు. దేశం నిజమైన స్వావలంబన సాధించాలంటే వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధికి పాలకులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అందుకు యువత ఉద్యమాలకు సిద్ధం కావాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

బిఆర్‌ఐపై మోడీ దాడి

వ్యాఖ్య


ఈ నెల 17వ తేదీన జరిగిన దక్షిణాది దేశాల సదస్సులో వర్చువల్‌గా ప్రసంగించిన మోడీ చైనా అమలు చేస్తున్న 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' (బి.ఆర్.ఐ) కార్యక్రమంపై దాడి చేశారు. నిలకడ లేని ప్రాజెక్టులకు చైనా వేల కోట్ల రూపాయల రుణాలను ఇవ్వటం ద్వారా ఆసియా, ఆఫ్రికా దేశాలను అప్పులలో మునిగిపోయేలా చేస్తున్నదని విమర్శించారు. బి.ఆర్.ఐకి ప్రత్యామ్నాయంగా ఇతర దేశాలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయటానికంటూ 'గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్' (జి.డి.సి)ను మోడీ ప్రతిపాదించారు. ఇది పేద వర్ధమాన దేశాలు ప్రతిపాదించిన అభివృద్ధి నమూనాపై దృష్టి పెడుతుందని, అప్పులు చేస్తున్న దేశాలపై కూడా ఎలాంటి భారం మోపదని ఆయన చెప్పారు. జి.డి.సి లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా వాణిజ్యం అభివృద్ధి చెందుతుందని, సుస్థిరాభివృద్ధిని సాధించటం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవటం జరుగుతుందని, ప్రాజెక్టులకు రాయితీ రుణాలు, గ్రాంట్లను పొందవచ్చునని ఆయన చెప్పారు. చైనా వేల కోట్ల డాలర్ల పెట్టుబడులతో బిఆర్‌ఐని అమలు చేస్తుండగా, ఎటువంటి పెట్టుబడులు, సన్నాహాలు లేకుండా జి.డి.సి ని ప్రతిపాదించటం ఊహాజనితం మాత్రమే. ఈ సందర్భంలో మోడీ చేసిన వ్యాఖ్యలు చైనా వ్యతిరేకతను పెంచటానికి దోహదం చేస్తాయి.

బి.ఆర్.ఐ లో మొత్తం 152 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఆఫ్రికా ఖండంలోని 52, యూరప్, సెంట్రల్ ఆసియాలో 34, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో-చైనాతో కలిపి-25, లాటిన్ అమెరికా, కరిబియన్ దేశాలు 22, మధ్యప్రాచ్యం, ఉత్తర అమెరికా లోని 19 దేశాలు, ఆసియా దక్షిణ, తూర్పు ప్రాంతంలోని 6 దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. వీటితో పాటు యూరోపియన్ యూనియన్ లోని 17 దేశాలు, జి 20లోని 8 దేశాలు, 30కి పైగా అంతర్జాతీయ సంస్థలు కూడా భాగస్వాములుగా ఉన్నాయంటేనే దీని ప్రాముఖ్యత ఏమిటో అర్థం అవుతుంది.



ఎ. కోటిరెడ్డి

ఇప్పటి వరకు ప్రపంచంలోని ఏ ఒక్క దేశం ఇంత భారీ పథకాన్ని రూపొందించి అమలు చేయటానికి పూనుకోలేదు. ఈ పథకంలో భాగస్వాములైన దేశాలలో సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడిన ప్రాజెక్టులను చైనా నిర్మిస్తున్నది. ఆ యా ప్రాజెక్టులను నిర్మించటం కోసం ఆ దేశాలకు ద్రవ్య రూపంలో కూడా సహకారాన్ని అందిస్తున్నది. ఈ పథకంలో భాగంగా నిర్మిస్తున్న వాటిలో రైల్వేల నుండి ఉపగ్రహాల వరకు ఉన్నాయి. ఇతర అనేక పథకాలతో పాటు జల విద్యుత్ ప్రాజెక్టులు, రవాణా, ఓడరేవులు, మంచినీటి సరఫరా, పారిశుధ్యం తదితర పథకాలను అమలు చేస్తున్నది. వివిధ దేశాలలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే కార్యక్రమాలను అమలు చేయటం వలన భాగస్వామ్య దేశాల మధ్య సరుకులు, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం ఇచ్చి పుచ్చుకోవటం పెరిగింది.



పేద దేశాలు దివాళా తీయటానికి కారణమౌతున్న ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు తదితరాల జోలికి పోకుండా...బి.ఆర్.ఐ సరళంగా ఇస్తున్న రుణాలను మోడీ తెగనాడుతున్నారు. బి.ఆర్.ఐ ఇస్తున్న రుణాలు, ఈ సంస్థలు కఠినమైన షరతులతో ఇస్తున్న రుణాలకు ప్రత్యామ్నాయంగా ఉన్నాయి. దీన్ని మోడీ సహించలేకపోతున్నారు. ఈ ప్రత్యామ్నాయాన్ని పక్కన పెట్టి అభివృద్ధి చెందుతున్న దేశాలు అమెరికా, సామ్రాజ్యవాద దేశాల ఉచ్చులో చిక్కుకోవాలని మోడీ భావిస్తున్నారు.

బి.ఆర్.ఐ అమలు తీరుపై 2019లో జరిగిన సమీక్షలో దానిలో సభ్యులుగా చేరిన దేశాలు పొందుతున్న ప్రయోజనాలను పేర్కొన్నారు. అప్పటికి ఈ పథకాన్ని ప్రారంభించి ఆరు సంవత్సరాలు అవుతున్నది. ఈ పథకంలో భాగస్వాములైన దేశాలు ఉమ్మడి నిర్మాణాల వలన ప్రయోజనం పొందు తున్నాయని, ఆ ప్రాంతాలలో అభివృద్ధి వేగం పుంజుకున్నదని, ప్రపంచ స్థాయిలో సహకారం పెరగటానికి దోహదం చేసిందని స్పష్టం చేశారు. ఉదాహరణకు బి.ఆర్.ఐకి ముందు చైనా నుండి యూరప్ దేశాలకు సరుకులను పంపటానికి ఒంటెలపై నెలల తరబడి ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇపుడు నిర్మిస్తున్న హై స్పీడ్ రైలు మార్గాల ద్వారా ఒక్కరోజు లోనే సరుకులను చైనా నుండి యూరప్‌కు, యూరప్ నుండి చైనాకు చేర్చవచ్చు. ఫలితంగా సరుకులు త్వరగా చేరటం, వాణిజ్యం విస్తరించటమే కాక, సమాచార సంబంధాలు కూడా విస్తరిస్తాయి.

నిబంధనలు, పన్నులు, మేధో సంపద హక్కులు, వివాద పరిష్కార పద్ధతులు తదితరాలపై బి.ఆర్.ఐ లో భాగస్వాములైన దేశాలతో చైనా ఒప్పందాలు చేసుకున్నది. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పెద్ద ముందడుగును సాధించారు. ఆసియా, ఆఫ్రికా, యూరప్, అమెరికా ఖండాలలోని ప్రజలను సన్నిహితం చేయటంలో ఈ ప్రాజెక్టు ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నది. 2013-18 మధ్య కాలంలో చైనా, బి.ఆర్.ఐ దేశాల మధ్య ఆరు లక్షల కోట్ల డాలర్ల విలువైన సరుకుల వాణిజ్యం జరిగింది. ఈ కాలంలో చైనా 9,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టింది. ఆ దేశాలలో 2.50 లక్షలకు పైగా నూతన ఉద్యోగాలు కల్పించబడ్డాయి. 15 యూరప్ దేశాలలోని 50 నగరాలను చైనాతో అనుసంధానం చేసి సరుకులను రవాణా చేసే రైళ్ళు 2019 నాటికే 14,000 ట్రిప్పులను పూర్తి చేశాయి. 2018 నాటికి గ్రీస్ లోని పైరియస్ ఓడరేవు కార్యకలాపాలు ఐదు రెట్లు పెరిగాయి. ఇపుడు ప్రపంచం లోని 100 అతి పెద్ద ఓడరేవులలో 36వ స్థానంలో ఉన్నది. 2019 తర్వాత గడిచిన ఐదు సంవత్సరాలలో ఈ కార్యకలాపాలు అనేక రెట్లు అదనంగా పెరిగాయన్నది స్పష్టమే.

అమెరికా ఆధిపత్యానికి గండి కొడుతున్న చైనా

ప్రపంచ దేశాలపై పెత్తనం చేస్తూ, కోట్లాది మందిని దారిద్ర్యంలో ముంచే విధానాలను అనుసరించాలని ఆ యా దేశాలను ఒత్తిడి చేస్తూ, యుద్ధాలను ప్రోత్సహిస్తూ, యుద్ధాలలో ప్రత్యక్ష పాత్ర వహిస్తూ లక్షలాది మంది ప్రాణాలు తీస్తున్న అమెరికా ఆధిపత్యాన్ని అన్ని రంగాలలోనూ చైనా సవాలు చేస్తున్నది. ఆర్థికంగా ప్రపంచ దేశాలను ఆదుకోవటంతో పాటు రాజకీయ, సైనిక, దౌత్య రంగాలలో అమెరికా విసురుతున్న సవాళ్ళను తిప్పికొడుతున్నది.

ప్రపంచంలో వివిధ దేశాలకు అవసరమైన సమయాలలో రుణాలు, సహాయాన్ని అందించే సంస్థలు కొద్ది సంఖ్యలో మాత్రమే ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు, చైనాకు చెందిన బి.ఆర్.ఐ, మరికొన్ని సంస్థలు ఉన్నాయి. వీటిలో బి.ఆర్.ఐ మినహా మిగిలిన సంస్థలు రుణాలు తీసుకొనే దేశాలపై కఠినమైన షరతులు పెట్టి, ఆంక్షలు విధించి, రుణాలు ఇస్తాయి. రుణాలు తీసుకున్న దేశాలు ఆ సంస్థలు విధించిన ఆంక్షలతో ప్రజలపై తీవ్రమైన భారాలను మోపాల్సి వస్తుంది. ప్రభుత్వ విధానాలు ప్రజల కొనుగోలు శక్తిని హరించి వేయటంతో కొద్ది కాలంలోనే ఆ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతాయి. ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న తూర్పు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు అనేకం సంక్షోభంలో కూరుకుపోయి, దివాళా తీయటాన్ని చూశాం. 1977 నుండి సరళీకరణ విధానాలను అనుసరించిన ఫలితంగా మన పొరుగు దేశమైన శ్రీలంక తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. ఆగ్రహించిన ప్రజలు లక్షలాదిగా ఆందోళనలలో పాల్గొనటంతో ఎన్నికైన ప్రభుత్వం పతనం అయింది. బెయిలవుట్ పేరుతో మరింత సంక్షోభంలోకి నెట్టే ఆంక్షలను విధించటంతో సంక్షోభం మరింత తీవ్రమైంది. ఈ సంస్థల షరతులను అంగీకరించకుండా స్వతంత్రంగా వ్యవహరించిన దేశాలు సంక్షోభం నుండి త్వరగా కోలుకున్నాయి. ఆంక్షలను అంగీకరించిన దేశాలు మరింత సంక్షోభంలో చిక్కుకున్నాయి. శ్రీలంకపై విధించిన ఆంక్షలు ఆ దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెడతాయి.

దీనికి భిన్నంగా బి.ఆర్.ఐ ద్వారా చైనా అందిస్తున్న రుణాలకు కఠినమైన షరతులను విధించటం లేదు. రుణాలు తీసుకున్న దేశాలలో సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతున్నది. చైనా ప్రధాన భాగస్వామిగా ఉన్న బ్రిక్స్ బ్యాంక్ కూడా రుణాలు తీసుకున్న దేశాల ప్రజలపై భారాలు విధించే, ఆ దేశాలను దివాళా తీయించే షరతులను విధించటం లేదు. ఫలితంగా చైనా దగ్గర రుణాలు తీసుకుంటున్న దేశాలు స్వేచ్ఛగా తమ దేశాలను అభివృద్ధి చేసుకోనే అవకాశం లభించింది.

పేద దేశాలు దివాళా తీయటానికి కారణమౌతున్న ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు తదితరాల జోలికి పోకుండా...బి.ఆర్.ఐ సరళంగా ఇస్తున్న రుణాలను మోడీ తెగనాడుతున్నారు. బి.ఆర్.ఐ ఇస్తున్న రుణాలు, ఈ సంస్థలు కఠినమైన షరతులతో ఇస్తున్న రుణాలకు ప్రత్యామ్నాయంగా ఉన్నాయి. దీన్ని మోడీ సహించలేకపోతున్నారు. ఈ ప్రత్యామ్నాయాన్ని పక్కన పెట్టి అభివృద్ధి చెందుతున్న దేశాలు... అమెరికా, సామ్రాజ్యవాద దేశాల ఉచ్చులో చిక్కుకోవాలని మోడీ భావిస్తున్నారు. ప్రపంచంలోని ప్రతి దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగేలా అమెరికా, దాని ఆధ్వర్యంలోని అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు వ్యవహరిస్తున్నాయి. ఇటువంటి సమయంలో చైనా, చైనా ఆధ్వర్యంలోని సంస్థలు ఇస్తున్న రుణాలు, రాజకీయ సహకారాన్ని ప్రపంచ దేశాలు మరింత ఎక్కువగా వినియోగించుకోవాలి.

కవిత్వం

అదును దాటిన పదును

మట్టిలో ఇరుక్కుపోయిన
గింజకు దాహమేసింది
ఒట్టి మన్ను కాకు దెబ్బకు
లోలోపల తల్లడిల్లి పోయింది
ఎదగాల్సిన విత్తు
చిత్తుగా ఓడిపోయాక
రైతును చూసి జీవితం
పకపకా నవ్వి ఊరుకుంది.
కొన ఊపిరితో
మొలకెత్తని విత్తుని చూసి
మేఘం తిన్నగా చినుకుని
నేలకు జారవిడిచి పోయింది
కర్షకుని కళ్ళల్లో ఆనందం
పచ్చని మొక్కలా ఎదిగింది
ఆకులు తొడిగి
పిందె కోసం ఎదురు చూసింది.
ఇప్పుడు
చెట్టుకు దప్పిక వేసింది
గాలి విసురుకు ఊగిపోతూ
మూలాల్ని కాపాడుకుంటోంది
ఎండిన దశకు వచ్చిన పిందెల్ని
తన వేర్ల రెక్కల కిందికి తోచి
జాగ్రత్తగా కాపాడుకుంటోంది.
ముసిరిన
వాన మబ్బుల్ని చూసి
ఎంతో మురిసిపోయింది చెట్టు
అదును దాటిన పదును ధాటికి
ఊపిరాడని మొక్క
నిర్దాక్షిణ్యంగా కన్ను మూసింది
ఊళ్ళను సైతం
ఊడ్చుకుపోతున్న వాగులో
కలిసిపోయి కనుమరుగైంది.
ఇప్పుడు రైతు కన్నీళ్లు
వర్షపు నీటిలో కలిసిపోయాయి
రైతు గుండె చప్పుడు
ఉరుముల శబ్దంలో
ఎప్పుడో కలిసిపోయింది.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్ : 9666016636

లోకాయుక్త కర్నూలులో ఉంచుతారా.. విజయవాడకు మార్చుతారా..?

ప్రజాశక్తి, అమరావతి

కర్నూలులోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సి), లోకాయుక్త, వక్ఫ్ ట్రిబ్యునల్ అక్కడే కొనసాగిస్తారా లేక విజయవాడకు తరలిస్తారో చెప్పాలని రాష్ట్రాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనిపై ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప డివిజన్‌బెంచ్ బుధవారం ఆదేశించింది. ఏపీ పునర్విభజన చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా కర్నూల్‌లో వాటిని ఏర్పాటు చేశారంటూ గుంటూరుకు చెందిన డాక్టర్ మద్దిపాటి శైలజ 2021లో వేసిన పిల్‌పై విచారణను 3 వారాలకు వాయిదా పడింది.

హెల్మెట్ వినియోగ ఉత్తర్వుల అమలు శూన్యం

ప్రజాశక్తి, అమరావతి

చట్ట నిబంధనల ప్రకారం హెల్మెట్లు ధరించని వాహనదారులపై చర్యలు తీసుకోవాల్సిందేనని హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. తమ ఉత్తర్వుల అమలు విషయంలో ప్రభుత్వ చర్యలు సంతృప్తిగా లేవని పేర్కొంది. విజయవాడలో నూటికి 99 శాతం మంది హెల్మెట్లు ధరించడం లేదంది. హెల్మెట్ ధరించని వాళ్లపై తీసుకున్న చర్యలు వివరించాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డిజిపిలను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ధర్మాసనం బుధవారం ఆదేశించింది. హెల్మెట్ ధరించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ లాయర్ తాండవ యోగేష్ వేసిన పిల్‌పై విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

ఇసి మాక్ పోలింగ్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

ఇవిఎంలు, వివిప్యాట్ల తనిఖీలు, పరిశీలన స్థానంలో మాక్ పోలింగ్ నిర్వహించేలా కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 16న జారీ చేసిన సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమంటూ వైసిపి మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వేసిన పిటిషన్‌పై వాదనలు పూర్తి అయ్యాయి. తీర్పును వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటించారు తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక సమగ్ర పాలసీకి 4 వారాలు

ప్రజాశక్తి, అమరావతి

ఇసుక రవాణా వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతున్నాయని, వాటికి స్పీడ్ గవర్నర్ల అమర్చాలని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు తగిన చర్యలు చేపట్టాలంది. ప్రభుత్వం నుంచి ఒకరు్న బాధ్యత తీసుకోవాలంది. పూర్తిస్థాయి ఇసుక విధానం తెచ్చేందుకు ఎంత సమయం కావాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రభుత్వం వినతితో విచారణను 4 వారాలకు వాయిదా పడింది. ఇసుక తవ్వకాలపై దాఖలైన పలు పిల్స్‌లో చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

గిరిజనులకు తప్పని డోలి మోత

- గర్భిణిని మైదాన ప్రాంతానికి తరలింపు

ప్రజాశక్తి-కొమరాడ (పార్వతీపురం మన్యం జిల్లా)

ఎన్ని ప్రభుత్వాలు మారినా పార్వతీపురం మన్యం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు. రహదారి సౌకర్యం లేక కొమరాడ మండలంలోని గాజులగూడ నుంచి కెమిశిల ఓ గర్భిణిని డోలీపై మోసుకెళ్లారు. గాజులగూడకు చెందిన గర్భిణీ హిమరిక రజినికి నొప్పులు రావడంతో అత్యవసర పరిస్థితుల్లో బుధవారం ఉదయం డోలీపై కెమిశిలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నాగావళి నది అవతల ఉన్న గాజులగూడ నుండి కెమిశిల వరకు రెండు కిలో మీటర్లు మైదాన ప్రాంతమైనప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, ఉన్న రహదారి కూడా బురద కావడంతో నడిచి వెళ్లడానికి వీలు లేని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో గాజులగూడ నుంచి రజినికి డోలీతో మోసుకొని కుటుంబ సభ్యులు, కమ్యూనిటీ హెల్త్ వర్కరు, ఆశా కార్యకర్తలు కురుపాం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజన గ్రామాల్లో కనీస వసతులు కల్పించాలని కోరారు.



గర్భిణిని డోలిపై తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు

దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలైనా గిరిజన ప్రాంతాల్లో డోలీమోతలు తప్పకపోవడం సిగ్గుచేటని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో జరిగిన డోలీమోతపై ఆయన స్పందించారు. పాలకులు గిరిజనుల నుండి ఓట్లు దోచుకోవడమే తప్ప వారికి కనీస సౌకర్యాలకల్పనలో చిత్తశుద్ధి లేదని చెప్పడం ఇంతకన్నా నిదర్శనం ఏమిటి అని అన్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు, పాలకులు, అధికారులు స్పందించి గిరిజన పంచాయితీలకు రోడ్డు మార్గం కల్పించాలని గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

కౌంటర్ వేయని అధికారులకు కోర్టు ఖర్చులు

- హైకోర్టు కీలక ఉత్తర్వులు

ప్రజాశక్తి, అమరావతి

సకాలంలో కౌంటర్లు దాఖలు చేయని మూడు వేర్వేరు కేసుల్లో అధికారులకు హైకోర్టు కోర్టు ఖర్చులు చెల్లించాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) ప్రాంతీయ మేనేజర్కు రూ.50వేలు ఖర్చులు విధించింది. మరో కేసులో రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శికి రూ.10 వేలు, మూడో కేసులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రూ.10వేల చొప్పున ఖర్చులు విధించింది. న్యాయ సేవాధికార సంస్థకు ఆ మొత్తం చెల్లించాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. యాసంగా పెట్రో ఉత్పత్తులను ఏపీలో అమ్మడంపై దాఖలైన పిల్‌లో హెచ్‌పిసిఎల్ కౌంటర్ దాఖలు చేయకపోవడంతో రూ.50 వేలు ఖర్చు చెల్లించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్రంలో కింది కోర్టుల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ల నియామకాలు చేపట్టడం లేదన్న పిల్‌లో కౌంటర్ వేయని హోంశాఖ ముఖ్య కార్యదర్శికి రూ.10వేలు, కోర్టుల్లో సిసి కెమెరాల ఏర్పాటు పిల్‌లో కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రూ.10వేల జరిమానా విధించింది. ఈ కేసుల విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

శ్రీశైలంకు 1,53,104 క్యూసెక్కుల నీటి ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,53,104 క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరింది. అలాగే ఎగువ జూరాల నుండి 60, 202 క్యూస్సెక్కులు, తుంగభద్ర నుండి 92,652క్యూసెక్కులు, హంద్రీ ద్వారా 250 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి. కుడిగట్టు విద్యుత్తు ఉత్పాదనను నిలిపి వేయడంతో జలాశయం నీటిమట్టం 882.50అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 251.5822 టిఎంసిలుగా నమోదైంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి హంద్రీనీవా, సుజాల స్రవంతికి 1410, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కి 30,000, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో గడచిన 24 గంటల్లో 16.680 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేస్తూ దిగువ సాగర్‌కు 37,882 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి గట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయడం జరిగింది. నీటి ప్రవాహం కొనసాగితే గేట్లు తెరిచే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

21 యూనివర్సిటీలు నకిలీ

- యుజిసి ప్రకటన

న్యూఢిల్లీ : గతేడాది దేశవ్యాప్తంగా 20 నకిలీ యూనివర్సిటీలు ఉండగా, ఈ ఏడాది మే నాటికి వాటి సంఖ్య 21కి చేరింది. ఈ నకిలీ వర్సిటీలకు డిగ్రీలు ప్రదానం చేసే అధికారం లేదని గతంలోనే యుజిసి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. యుజిసి చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ యూనివర్సిటీలు ప్రదానం చేసే డిగ్రీలను ఉన్నత విద్య, ఉద్యోగ ప్రయోజనాల కోసం గుర్తించబోమని.. ఆ డిగ్రీలు చెల్లుబాటు కావని యుజిసి ఇప్పటికే తేల్చి చెప్పింది. గుంటూరులో కాకుమానివారి తోటలో క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, విశాఖలోని బైబిల్ ఓపెన్ యూనివర్శిటీ ఆఫ్ ఇండియాను నకిలీవిగా యుజిసి ప్రకటించింది. నకిలీగా ప్రకటించిన 21 యూనివర్సిటీలను యుజిసి తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇలాంటి వర్సిటీలు ఢిల్లీలో అత్యధికంగా ఎనిమిది ఉండగా, ఉత్తర ప్రదేశ్‌లో నాలుగు, ఏపీ, బెంగాల్, కేరళలో రెండు చొప్పున, కర్ణాటక, మహారాష్ట్ర, పుదుచ్చేరిలలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నట్టు తెలిపింది.

మన్యంలో కార్పొరేట్ వడ్డీలు

- పలు సంస్థలకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి, అమరావతి

అల్లూరి, మన్యం జిల్లాల పరిధిలో చట్ట వ్యతిరేకంగా వడ్డీ వ్యాపారాలు చేసే కార్పొరేట్ సంస్థలపై తీసుకున్న చర్యలు వివరించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. రెండు జిల్లాల ఎస్పీలను, సబ్ కలెక్టర్లు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, చోళమండలం ఇన్వెస్టిమెంట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీ, వరుణ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాఘవ ఆటో ఫైనాన్స్ కంపెనీలకు కూడా నోటీసులు ఇచ్చింది. ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు టి.వెంకట శివరామ్ దాఖలు చేసిన పిల్‌పై విచారణను 5 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

టిడిపి ఆఫీసుపై దాడి కేసు..

- వైసిపి నేతల ముందస్తు బెయిల్ పిటిషన్లపై 3న తీర్పు

ప్రజాశక్తి, అమరావతి

టిడిపి ఆఫీసుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పలువురు వైసిపి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో వాదలు ముగిశాయి. తీర్పును తర్వాత ప్రకటిస్తామని జస్టిస్ విఆర్ కృపాసాగర్ బుధవారం ప్రకటించారు. తీర్పు వెలువరించే వరకు వైసిపి నేతలపై కఠిన చర్యలొద్దంటూ గత మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. వైసిపి ఎమెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, దేవినేని అవినాష్ ఇతరులు ముందస్తు బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తి అయ్యాయి. తీర్పును రిజర్వ్ చేస్తూ సెప్టెంబర్ 3న తమ ఆదేశాలు జారీ చేస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

దేశంలోనే పెద్ద స్కామ్ మార్గదర్శి

- వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శి చిట్ ఫండ్‌లో డిపాజిట్లను సేకరించడం దేశంలోనే అతిపెద్ద స్కామ్‌గా నిలుస్తుందని వైసిపి ఎంపి పి మిథున్‌రెడ్డి అన్నారు. మార్గదర్శి అక్రమాలపై పార్లమెంటులో చర్చకు పెడతామని తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపిలో కొంత మంది వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని టిడిపి కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందన్నారు.

మంచిని చూడలేకపోతున్న ప్రభుత్వం : పేర్ని నాని

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన మంచిని కూటమి ప్రభుత్వం చూడలేక పోతుందని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. రూ.3.63 కోట్లతో ఎగ్‌పఫ్‌లు తిన్నారని తప్పుడు పోస్టులు పెడుతున్నారని అన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఆ లెక్కలన్నీ బయటపెట్టాలన్నారు. మెడికల్ కాలేజీల్లో సీట్లు అమ్ముకుంటున్నారంటూ అప్పట్లో గొడవ చేసి ఇప్పుడు వారేమి చేస్తున్నారో చెప్పాలన్నారు.

ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయడం తగదు : శ్రీకాంత్‌రెడ్డి

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేక ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయడం తగదని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వ పరంగా ఉద్యోగులకు అండగా నిలిచామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం సాధారణ ఉద్యోగుల నుండి ఐఎఎస్, ఐపిఎస్‌లను వేధిస్తోందని విమర్శించారు. కేవలం కడప జిల్లా వ్యక్తి అనే ఫైబర్ నెట్ ఎమ్‌డి మధుసూదనరెడ్డిని వేధిస్తున్నారని పేర్కొన్నారు.

కేబుల్ ఆపరేటర్ వల్లే విద్యుత్ ప్రమాదం

- కడప విద్యుత్ ప్రమాదంపై మంత్రికి అధికారుల వివరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప జిల్లాలో విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి చెందడానికి స్థానిక కేబుల్ ఆపరేటర్ కారణమని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. వరుస విద్యుత్ ప్రమాదాలపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సచివాలయంలో బుధవారం అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. కడప ఘటనపై సమాచారాన్ని అధికారుల నుంచి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాల ద్వారా కేబుల్ వైర్ లాగడానికి ప్రయత్నించిన తరుణంలో విద్యుత్ తీగ కిందపడిందని మంత్రికి అధికారులు వివరించారు. ఆ సమయంలోనే పిల్లలు అటువైపుగా రావడంతో ప్రమాదం చోటుచేసుకుందన్నారు. కేబుల్ ఆపరేటర్ ముందస్తు సమాచారం అందించి ఉంటే ప్రమాదం తప్పేదన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ఫార్మా కంపెనీ రియాక్ట్ పేలుడు ఘటనలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

ఆవేదన కలిగించిన చిన్నారి మృతి

కడప జిల్లాలో విద్యుత్ షాక్‌తో బాలిక మృతిచెందిన ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని లోకేష్ మరో ప్రకటనలో పేర్కొన్నారు. గాయపడిన మరో విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

త్వరలో కొత్త పార్టీ

- జార్ఖండ్ మాజీ సిఎం చంపయీ సోరెన్ ప్రకటన

రాంచీ : మరో వారం రోజుల్లో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయీ సోరెన్ ప్రకటన చేశారు. ఎక్స్ వేదికగా బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేశారు. అనంతరం స్థానిక మీడియాతోనూ మాట్లాడారు. 'రాజకీయాల నుంచి రైటైర్ అవ్వాలా, కొత్త పార్టీ ఏర్పాటు చేయాలా? ఇతర మిత్రులతో కలిసి ముందుకు సాగాలా?' అనే అంశాలను పరిశీలించానని చంపయీ సోరెన్ అన్నారు. చివరికి కొత్త పార్టీ ఏర్పాటు చేసి, బలోపేతం చేస్తానని, మంచి మిత్రులతో కలిసి ముందుకు సాగుతానని ప్రకటించారు.

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచండి

- కాలం చెల్లిన వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు : సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న రోజుల్లో ఆర్‌టిసిలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సిఎం ఆర్‌టిసిపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఆర్‌టిసిలో డీజిల్ బస్సులు, ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుతో పాటు నిర్వహణ, మైలేజ్‌లో ఉన్న వ్యత్యాసాన్ని లెక్కించాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్‌టిసిలోనూ ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు కేంద్రం ఇస్తున్న సబ్సిడీలను వినియోగించుకుని 1,253 ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చాలన్నారు. దూర ప్రాంతాలకు ఎలక్ట్రిక్ బస్సులు నడిపితే ఛార్జింగ్ విషయంలో తలెత్తే సమస్యలకు పరిష్కారాలు ఆలోచించాలని అధికారులకు సూచించారు. ఆర్‌టిసిలో అద్దె బస్సులు, సొంత బస్సుల విధానం వల్ల లాభనష్టాలు, సొంతంగా బస్సులు కొనుగోలు చేయడం వల్ల కలిగే ఉపయోగాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేయాలని సూచించారు. గత ప్రభుత్వం కొత్తగా బస్సుల కొనుగోలు చేయలేదని, 15 లక్షల కిలోమీటర్లు కంటే ఎక్కువ తిరిగిన బస్సులు కూడా ప్రస్తుత సర్వీసుల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ కారణంగానే బస్సులకు బ్రేక్ డౌన్ సమస్యలు తలెత్తి, ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులను తగ్గించిందని, తిరిగి సర్వీసుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆదాయానికి కీలకమైన ఆర్‌టిసి కార్గో ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. ఆర్‌టిసిలో ఆన్‌లైన్ విధానాలను సమర్థవంతంగా నిర్వహించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన 1,489 డీజిల్ బస్సులను సమకూర్చుకోవాలన్నారు. గత ప్రభుత్వం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసింది తప్ప, ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. ప్రమాదాల నివారణకు ఎస్‌పి, కలెక్టర్, రోడ్ సేఫ్టీ అధికారులు సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను తొలగించాలని ఆదేశించారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సు, ఆర్‌సి కార్డులు అందించాలన్నారు.

ఉచిత బస్సు పథకంపై సమీక్ష

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకంపై అధికారులతో సిఎం చంద్రబాబు చర్చించారు. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ఢిల్లీ, కర్ణాటక, పంజాబ్, తమిళనాడుతోపాటు ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై అధికారులు పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలన్నారు. ఈ మేరకు అధికారుల బృందం ఆయా రాష్ట్రాల్లో పర్యటించి నివేదిక సిద్ధం చేయాలన్నారు.

మహారాష్ట్రలో కీచక టీచర్



ముంబయి : పశ్చిమబెంగాల్‌లోని కోల్‌తాలో జూనియర్ డాక్టర్‌పై దారుణ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసిన సమయంలోనే మహారాష్ట్రలో ఓ కీచక టీచర్ ఉదంతం వెలుగుచూసింది. బాధిత విద్యార్థినులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అకోలా జిల్లా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు ప్రమోద్ సర్దార్ పాఠాలు చెప్పటాన్ని పక్కనబెట్టి బాలికలతో అసభ్యకరంగా వ్యవహరించేవాడు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఆరుగురు బాలికలకు నాలుగు నెలలుగా బూతు బొమ్మలు చూపిస్తున్నాడు. వారిని తాకరాని చోట తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడుతూ వచ్చాడు. ఉపాధ్యాయుడి అనుచిత చేష్టల గురించి బాధిత విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు చెప్పటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని బాలల సంక్షేమ కేంద్రం టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి, సంబంధిత అధికారులకు ఒక విద్యార్థిని తెలియజేసింది. అధికారులు పాఠశాలకు వెళ్లి, దర్యాప్తును ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాలల సంరక్షణ కమిటీ సభ్యులు కూడా పాఠశాలను సందర్శించారు. కొందరు బాలికలతో మాట్లాడారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు ఆశా మిర్గే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదుపరి విచారణ కొనసాగుతున్నదని పోలీసు అధికారులు వెల్లడించారు.

పంటలపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)

పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలోని వంగంవారిపల్లి పంచాయతీ పరిధిలో మంగళవారం రాత్రి స్వైరవిహారం చేశాయి. వంగంవారిపల్లికి చెందిన రైతు దేవప్ప రెండు ఎకరాల్లో టమోటా సాగు చేశారు. మంగళవారం టమోటాలు కోసి బాక్కుల్లో పొలం వద్దనే భద్రపరిచారు. బుధవారం వేకువజామున మార్కెట్‌కు తీసుకువెళ్లాల్సి ఉండగా ఆ పంట పొలం వద్దకు ఏనుగులు వచ్చాయి. బాక్కులు, టమోటాలను ధ్వంసం చేశాయి. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు ఏనుగుల దాడిలో చిందరవందరగా ఉన్న టమోటా బాక్కులను చూసి లబోదిబోమన్నారు.

'ఉపాధి' గ్రామసభలపై విస్తృత ప్రచారం

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంవత్సరం మొత్తం ఉపాధి పనులు చేపట్టేందుకు అసవరమైన ప్రణాళిక రూపొందించేందుకు ఈ నెల 23న అన్ని పంచాయతీల్లో నిర్వహిస్తున్న గ్రామసభలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు విడుదల చేసిన ప్రకటనలో ఉపాధి పనుల సమావేశాలు అందరికీ తెలిసేలా ఊరంతా టాం టాం వేయించాలని, ఉపాధి మేట్లు ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ఉపాధి కూలీల్లో ప్రచారం చేసి సమావేశాలకు వచ్చేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 38 రకాల పనులు గుర్తించిందని, వాటిల్లో పేదలకు సంబంధించిన ముఖ్య కార్యక్రమాలు పేర్కొనలేదని తెలిపారు. గతంలో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చిందని, అవి పల్లపు భూమిలో ఇవ్వడం వల్ల పేదలకు మెరక తీసుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆ స్థలాలు వర్షం వస్తే ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. పేదలకిచ్చిన ఇళ్లస్థలాలు మెరకచేసి పేదలకు అప్పగిస్తే గృహ నిర్మాణానికి వీలవుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాటిని మెరకచేసే కార్యక్రమం చేపట్టాలని, స్మశానాలకు చాలా గ్రామాల్లో రోడ్డు సౌకర్యం లేదని వివరించారు. ఇటువంటి స్మశానాలకు రోడ్లు ఫార్మేషన్ పెట్టాలని, మౌలిక సదుపాయాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మెయిన్ రోడ్ల నుండి దళిత పేటలను కలుపుతూ రోడ్డు మార్గాలు లేవని, అటువంటి గ్రామాలను గుర్తించి దళిత పేటల్లో రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. చాలా గ్రామాల్లో వర్షాలు వస్తే వరద నీరు దళిత పేటల్లోకి వస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి చోట గోడ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎలిమెంటరీ స్కూళ్లను పల్లపు భూముల్లో కట్టారని, ఏ మాత్రం వర్షం వచ్చినా మునిగి పోయి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటువంటి స్కూళు ,,ఆట స్థలాల్లో మెరకపోయాలని, రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నపనులే కాకుండా నిర్దిష్టంగా ఆయా గ్రామాల్లో ఏ పనులు చేపడితే బాగుంటుందో వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు సూచించే వాటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

ఖర్చులకు కాసులెలా..!

- శాఖల వారీ సరికొత్త ప్రతిపాదనలు
- సెస్‌లు, మద్యం, బకాయిల వసూళ్లపైనే దృష్టి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఎలా ప్రవేశపెట్టాలన్న కోణంలో ఆర్థికశాఖ అధికారులు తలమునకలవుతున్నారు. ఖర్చులు భారీగా కళ్లముందు కనిపిస్తుండడం, అందుకు తగ్గ ఆదాయం కనిపించకపోవడంతో ఏమి చేయాలన్నది అర్థం కాని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఆర్థికశాఖ అధికారులంతా కలిసి భవిష్యత్తు కార్యాచరణ సిద్ధం చేసేలా కసరత్తు ప్రారంభించారు. శాఖల వారీ సరికొత్త ప్రతిపాదనలు స్వీకరించే ప్రక్రియను కూడా ప్రారంభించారు. ఇప్పటికే రెండు దఫాలుగా ఓటాన్ అకౌంట్ ద్వారా నిధుల వ్యయానికి అనుమతులు తీసుకోగా, నవంబరులో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. స్వల్ప మార్పులతోనే ఈ బడ్జెట్ ఉంటుందని ముందుగా ఊహించగా, పెరుగుతున్న ఖర్చులకు, వస్తున్న ఆదాయానికి మధ్య పొంతన కనిపించకపోవడంతో నవంబరులో ప్రవేశపెట్టే పూర్తి స్థాయి బడ్జెట్‌ను సమూలంగా మార్పులు చేయాలని నిర్ణయించారు. దీనికోసం ఆదాయాన్ని కూడా గణనీయంగా పెంచి చూపించాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తుది బడ్జెట్ కోసం రాష్ట్ర ఆర్థికశాఖ కసరత్తును ముమ్మరం చేసింది. అన్ని శాఖల అధికారులకు సర్క్యులర్లు జారీ చేసి వివరాలు కోరింది. తొలి రెండు విడతల ఓటాన్ అకౌంట్ల వివరాలను అన్ని శాఖలకూ పంపడం ద్వారా వాటికి సవరించేందుకు తీసుకోవాల్సిన ప్రతిపాదనలపై వివరాలు కోరింది. ఇప్పటికే కొన్ని శాఖల నుంచి అదనపు నిధుల వివరాలు వచ్చినట్లు తెలిసింది. వీటికి క్రోఢీకరించి తుది బడ్జెట్ కూర్పు రూ.3.10 లక్షల కోట్ల నుంచి రూ.3.20 లక్షల కోట్ల వరకు ప్రతిపాదించే అవకాశాలు ఉన్నాయని సీనియర్ ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి తొలుత ఫిబ్రవరిలో రూ.2.86 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అందులో తొలి నాలుగు నెలలకు రూ.1.09 లక్షల కోట్ల వ్యయానికి శాసనసభలో అనుమతి తీసుకున్నారు. ఈ గడువు జులై 31తో పూర్తికావడంతో జులై నెలాఖరులో మరోసారి ఓటాన్ అకౌంట్ కోసం ఆర్డినెన్స్ ద్వారా నాలుగు నెలలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి రూ.1.30 లక్షల కోట్ల వరకు అనుమతి తీసుకోవడం గమనార్హం. అంటే రెండు విడతల ఓటాన్ అకౌంట్ల ద్వారా ఎనిమిది నెలలకు రూ.2.39 లక్షల కోట్లకు అనుమతి తీసుకున్నారు. అయితే మొత్తం బడ్జెట్‌లో తొలి ఎనిమిది నెలలకు అనుమతిగా తీసుకున్న మొత్తం పోగా ఇంకా రూ.61 వేల కోట్ల వరకు మాత్రమే మిగలడంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే మొత్తం బడ్జెట్ కూర్పును సమూలంగా మార్పు చేయాలని నిర్ణయించారు.

ఆదాయాన్ని ఎలా పెంచాలి

గత ఫిబ్రవరి బడ్జెట్‌కు నవంబరులో ప్రవేశపెట్టే బడ్జెట్‌కు మధ్య దాదాపు రూ.30 వేల కోట్ల నుంచి రూ.35 వేల కోట్ల వరకు తేడా ఉండనుంది. ఈ అదనపు మొత్తాన్ని ఎలా సమీకరించాలన్న దానిపైనే అధికారులు చర్చించుకుంటున్నారు. ప్రధానంగా వాణిజ్య, మద్యం శాఖల ద్వారా వచ్చే ఆదాయాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. సంపద సృష్టి అన్నది ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఉన్న వనరులనే పెంచుకోవాల్సి ఉంటుంది. అందుకే సెస్‌ల విధానాన్ని, వివిధ సేవా రుసుములను సవరించడం, పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలను ముక్కుపిండి వసూలు చేయడంపైనే ఎక్కువగా దృష్టి సారించాల్సి ఉంటుందని ఒక అధికారి పేర్కొన్నారు.

62 ఏళ్లకు ఉద్యోగ విరమణ

- మంత్రికి ఆల్ యూనివర్సిటీస్ యూనియన్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న టైం స్కేల్ సిబ్బంది ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడును యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, కెఎస్ కోటేశ్వరరావు బుధవారం సచివాలయంలో కలిసి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. 30 ఏళ్లకు పైగా టైంస్కేల్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. 2014కు ముందు నుంచి పనిచేస్తున్న టైంస్కేల్, ఎన్ఎంఆర్, డైలీవేజ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు ఐదు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి గ్రాట్యూటీ, పింఛనుతోపాటు ఇతర బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. ఇతర యూనివర్సిటీల్లా క్యాడర్‌వైజ్ స్కేల్స్ అమలు చేయాలన్నారు.

నిరసనలు ఉధృతం

కొల్‌కతా : కొల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో న్యాయం కోసం జూనియర్ డాక్టర్లు తమ ఆందోళనను మరింత ఉధృతం చేశారు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులకు చెందిన జూనియర్ డాక్టర్లు బుధవారం నిరసన ర్యాలీలు నిర్వహించారు. పనిప్రదేశాల్లో భద్రత పెంచాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ పిలుపు మేరకు ఈ ర్యాలీలు నిర్వహించారు.

సెప్టెంబరు 4కి వాయిదా

ఆర్‌జి కర్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య, తదనంతరం ఆస్పత్రిపై దుండగులు జరిపిన విధ్వంసానికి సంబంధించి దాఖలైన పలు ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాల సంయుక్త విచారణను కలకత్తా హైకోర్టు సెప్టెంబరు 4కి వాయిదా వేసింది.

ఘోష్‌పై ఇడి దర్యాప్తు చేపట్టాలి

ఆర్‌జికార్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ పాల్పడిన ఆర్థిక అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)తో దర్యాప్తు చేపట్టాలని కోరుతూ అదే ఆస్పత్రిలో గతేడాదివరకు పనిచేసిన మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్, ప్రస్తుతం ముర్షిదాబాద్ డిప్యూటీ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా వున్న అక్తర్ అలీ కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై పిటిషన్ దాఖలు చేసేందుకు జస్టిస్ రాజర్షి భరద్వాజ్, అలీకి అనుమతి మంజూరు చేశారు.

డాక్టర్ ఘోష్ పాల్పడిన అనేక అవకతవకలపై 2023లోనే పశ్చిమ బెంగాల్ అధికారులకు ఫిర్యాదు చేశానని అలీ ఇంతకుముందే చెప్పారు. ఈ ఆరోపణలపై తాజాగా ఏర్పడిన సిట్ ఇటీవల అక్తర్‌ను విచారించింది. ఆయన చేసిన ఫిర్యాదుల ఆధారంగానే ఘోష్‌పై ఎఫ్ఆర్ నమోదైంది. సందీప్ ఘోష్ వ్యక్తిగత, వృత్తి జీవితాలు రెండూ వివాదాస్పదమేనని అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రిలో అనాథ శవాలను విక్రయించడం, సెలైన్ బాటిళ్లు, సిరంజ్‌లు వంటి వాడి పారేసిన ఆస్పత్రి సామాగ్రిని రీ సైక్లింగ్ చేయించడం వంటి ఆరోపణలను ఆయన ఎదుర్కొంటున్నారు. తరచూ భార్యపై కూడా అమానుషంగా ప్రవర్తించే వాడని ఆరోపణలున్నాయి. సిజేరియన్‌తో బిడ్డకు జన్మనిచ్చిన భార్యపై 14రోజుల వ్యవధిలోనే దారుణంగా దాడికి దిగాడని ఇరుగు, పొరుగువారు చెబుతున్నారు.

కోర్టు ముందుకు కేజ్రీవాల్, కవిత

- తదుపరి విచారణ 28కి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ కేసులో సిబిఐ దాఖలు చేసిన సప్లమెంటరీ చార్జ్‌షీట్‌పై విచారణను రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి వాయిదా వేసింది. సిబిఐ చార్జ్‌షీట్ కాపీలు, అనువాద పత్రాలు నిందితుల తరపున న్యాయవాదులకు అందకపోవడంతో విచారణ వాయిదా వేస్తున్నట్లు ట్రయల్ కోర్టు వెల్లడించింది. ఈ కేసు వ్యవహారంలో జూన్ 7న కేజ్రీవాల్, కవితతోపాటు, మరో నలుగురిపై సప్లమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ చార్జ్‌షీట్‌ను జులై 22న కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అలాగే అంతకముందు మనీష్ సిసోడియా, అమన్ దీప్ దళ్, బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లి, ముత్తా గౌతమ్, సమీర్ మహేంద్రుపై సిబిఐ అదనపు చార్జ్‌షీట్ వేసింది. ఈ చార్జ్‌షీట్లపై బుధవారం సిబిఐ కోర్టు స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా విచారణ చేపట్టారు.

ఈ సందర్భంగా కేజ్రీవాల్, కవితతో పాటు, సహ నిందితులను తీహార్ జైలు అధికారులు వర్చువల్ మోడ్‌లో కోర్టు ముందు హాజరుపరిచారు. కవిత తరపున న్యాయవాది నితీష్ రాణా వాదనలు వినిపిస్తూ.. సిబిఐ చార్జ్‌షీట్ కాపీలు తమకు అందలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సిబిఐ తరపున న్యాయవాది జోక్యం చేసుకుని నిందితుల న్యాయవాదులకు మంగళవారం సాయంత్రమే అనువాద కాపీలను అందజేసినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన స్పెషల్ జడ్జి, సిబిఐ తరపున న్యాయవాదికి ఇ-మెయిల్ ఐడి ఇవ్వాలని కవిత న్యాయవాదికి సూచించారు. ఎ4, ఎ7, ఎ11, ఎ17 తరపున న్యాయవాదులకు చార్జ్‌షీట్ కాపీలు ఇ-మెయిల్ చేస్తామని సిబిఐ తరపున న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. చార్జ్‌షీట్ పత్రాలు అసంపూర్తిగా ఉన్నాయని సహ నిందితుల తరపున న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. అన్ని వైపులా వాదనలను పరిగణనలోకి తీసుకున్న స్పెషల్ జడ్జ్, నిందితుల తరపున న్యాయవాదులకు రెండు రోజుల్లో పూర్తి స్థాయి చార్జ్‌షీట్ కాపీలు, అనువాద పత్రాలు అందజేయాలని సిబిఐకు ఆదేశించారు. తదుపరి విచారణ ఈ నెల 28కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

వందకోట్ల డాలర్ల సాయం

- ప్రపంచ బ్యాంక్‌ను కోరిన బంగ్లాదేశ్

ఢాకా : బంగ్లాదేశ్‌కు వందకోట్ల డాలర్ల సాయం కావాలని విద్యుత్, ఇంధనం, ఖనిజవనరుల మంత్రిత్వ శాఖ సలహాదారు మహ్మద్ ఫౌజల్ కబీర్ ఖాన్ బుధవారం ప్రపంచ బ్యాంక్‌ను కోరారు. ప్రస్తుతం విద్యుత్, ఇంధనం దిగుమతుల వ్యయాలకు సంబంధించి మంత్రిత్వ శాఖకు 220కోట్ల డాలర్ల బకాయిలు వున్నాయని తెలిపారు. బంగ్లాదేశ్, భూటాన్ వ్యవహారాలకు సంబంధించి ప్రపంచబ్యాంక్ డైరెక్టర్‌గా వున్న అబ్దుల్లా సెక్‌తో కబీర్ బుధవారం భేటీ అయ్యారు. నలుగురు సభ్యుల ప్రతినిధి బృందంతో కబీర్ ఆయనను కలిశారు. తాత్కాలిక ప్రభుత్వంపై ప్రస్తుతం అనేక ఒత్తిడులు వున్నాయని చెప్పారు. ఇంధన సరఫరా చట్టం, 2019 అలాగే ఇంధన ధరలను నిర్ణయించేందుకు ప్రభుత్వానికి గల అధికారాలు రద్దు చేయబడ్డాయని, వాటిపై ప్రజా విచారణ లేకుండా చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని తెలిపారు.

బాద్లాపూర్ ఘటనపై 24న మహారాష్ట్ర బంద్

- ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ పిలుపు
- 300మందిపై ఎఫ్ఐఆర్, 40మందికి పైగా అరెస్టు
- నిలిచిన ఇంటర్‌నెట్ సేవలు
- మూతపడిన దుకాణాలు, పాఠశాలలు



బద్లాపూర్ రైల్వే స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

బాద్లాపూర్ : మహారాష్ట్ర బాద్లాపూర్‌లో పసిపిల్లలపై స్వీపర్ లైంగిక వేధింపులను ఖండిస్తూ ప్రతిపక్ష మహా వికాస్ అఘాఢి (ఎంవిఎ) ఈ నెల 24న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ ఘటనపై మంగళవారం తీవ్ర స్థాయిలో ఆందోళనలు, నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఇక్కడ సమావేశమైన ప్రతిపక్ష నేతలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రతిపక్షనేత విజయ్ వాడెతివర్ మీడియాకు తెలిపారు. ఎంవిఎ భాగస్వామ్య పక్షాలన్నీ ఈ బంద్ పాల్గొంటాయని చెప్పారు.

రాజకీయ దురుద్దేశంతోనే ఆందోళనలు : సిఎం షిండే

బాద్లాపూర్‌లో మంగళవారం నాటి నిరసనలు, ఆందోళనలన్నీ రాజకీయ దురుద్దేశంతో కూడినవని, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేయడానికి చేసినవని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆందోళనకారుల్లో మెజారిటీ వ్యక్తులు బయటివారేనని, ఈ సంఘటనపై రాజకీయాలు చేయాలనుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వమే రాజకీయాలు చేస్తోంది : ప్రతిపక్షాలు

ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఈ సంఘటనను రాజకీయం చేసేది ప్రభుత్వమేనని కాంగ్రెస్ నేత నానా పటోలె విమర్శించారు. బాలలపై నేరాలు ఎక్కువగా జరుగుతోంది మహారాష్ట్రలోనేనని, దాదాపు 21వేల సంఘటనలు జరగగా వాటిని ప్రభుత్వం కప్పిపెట్టిందని అన్నారు. సిఎం సొంత జిల్లా థానేలో మహిళలపై నేరాలు 57శాతం పెరిగినా తీసుకున్న చర్యలు శూన్యమని కాంగ్రెస్ నేత అస్లామ్ షేక్ విమర్శించారు. నేరం జరిగిన స్కూలుకు బిజెపితో సంబంధాలున్నాయని, కేసు విచారణకు నియమించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్ బిజెపి టిక్కెట్‌పై పోటీ చేసి ఓడారని, అటువంటప్పుడు ఈ కేసు విచారణ సక్రమంగా జరుగుతుందన్న నమ్మకమేమిటని ప్రశ్నించారు. దాదాపు 13గంటల తర్వాత కానీ ఈ సంఘటనపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయలేదని, దీని వెనుక ఎవరి హస్తం వుందని, ఎవరి ఆదేశాల మేరకు ఈ ఆలస్యం జరిగిందని ఎన్‌సిపి (ఎస్‌పి) అనిల్ దేశ్‌ముఖ్ ప్రశ్నించారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉజ్వల్ నికమ్

బాద్లాపూర్ లైంగిక వేధింపుల కేసు విచారణ కోసం సీనియర్ న్యాయవాది ఉజ్వల్ నికమ్‌ను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మహారాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ముంబయి నార్త్ సెంట్రల్ నుండి బిజెపి టిక్కెట్‌పై పోటీ చేసి ఓడిపోయారు.

300మందిపై ఎఫ్ఐఆర్‌లు

పసిపిల్లలపై దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలంటూ థానే జిల్లా బాద్లాపూర్‌లో మంగళవారం పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చెలరేగిన నేపథ్యంలో మహారాష్ట్ర పోలీసులు 300మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 40మందికి పైగా అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని బుధవారం కోర్టులో ప్రవేశపెట్టారు. రైల్వే స్టేషన్‌లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. అదనపు బలగాలను మోహరించారు. బాద్లాపూర్ రైల్వే స్టేషన్ వద్ద, ఇతర ప్రాంతాల్లో మంగళవారం రాళ్ళు విసిరిన సంఘటనల్లో 17మంది పోలీసులు, 8మంది రైల్వే పోలీసులు గాయపడ్డారు. ఈ ఘటనలకు సంబంధించి 72మందిని అరెస్టు చేశారు. రైళ్ల రాకపోకలు బుధవారం తెల్లవారుజామున పునరుద్ధరించామని, ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని రైల్వే పోలీసుల డిసిపి మనోజ్ పాటిల్ తెలిపారు. పుకార్లు వ్యాప్తి చెందకుండా వుండేందుకు గానూ ఇంటర్‌నెట్ సర్వీసులను నిలిపివేశామని, మరికొన్ని రోజులు నిలిపివేస్తామని చెప్పారు. బాద్లాపూర్‌లో దుకాణాలను మూసివేశారు. చాలావరకు పాఠశాలలు మూతపడ్డాయి.

అమెరికాలో భారతీయ డాక్టర్ అరెస్టు

- మహిళలు, పిల్లలను నగ్నంగా వీడియోలు తీశాడు



వాషింగ్టన్: లైంగిక వేధింపుల కేసులో భారతీయ సంతతికి చెందిన 40 ఏళ్ల డాక్టర్ ఒమర్ అయిజాజ్‌ను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. సుమారు 16 కోట్ల బాండ్‌పై అతన్ని ఈ నెల 8న అదుపులోకి తీసుకున్నారు. అతనిపై లైంగిక వేధింపుల కేసులు నమోదు అయ్యాయి. పిల్లలు, మహిళలకు చెందిన నగ్న వీడియోలను తీసినట్లు ఆ డాక్టర్‌పై ఆరోపణలున్నాయి. మిచిగన్ రాష్ట్రంలోని ఓక్లాండ్ కౌంటీలో ఉన్న రోచెస్టర్ హిల్స్‌లో డాక్టర్ నివాసముంటున్నాడు. కొన్ని అభ్యంతరకర ఫోటోలు, వీడియోలను అతని భార్య పోలీసులకు అప్పగించిన తర్వాత అధికారులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని నివాసంలో సోదాలు నిర్వహించగా, వేల సంఖ్యలో వీడియోలు గుర్తించినట్లు పోలీసులు చెప్పారు. కంప్యూటర్లు, ఫోన్లు, 15 ఎక్స్‌టర్నల్ డివైస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఓ హార్డ్ డ్రైవ్‌లో సుమారు 13వేల వీడియోలు ఉన్నటు, స్పృహలోలేని, నిద్రలో ఉన్న మహిళలపై అత్యాచారం చేసిన వీడియోలు రికార్డు చేసినట్లు గుర్తించారు.

వార్సా చేరుకున్న మోడీ

ద్వైపాక్షిక సహకారంపై చర్చ

న్యూఢిల్లీ : మూడవ పర్యాయం అధికారం చేపట్టిన తరువాత ప్రధాని నరేంద్రమోడీ సాగిస్తున్న విదేశీ యాత్రల పరంపరలో తాజాగా పోలండ్ వెళ్లారు. అక్కడి నుంచి ఉక్రెయిన్ వెళ్తారు. బుధవారం వార్సాకు చేరుకున్న మోడీ పోలండ అధ్యక్షుడు ఆండ్రెజ్ సెబాస్టియన్ దుడాతో భేటీ అయ్యారు. అనంతరం ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. గత 45ఏళ్ళలో ఆ దేశాన్ని సందర్శించిన తొలి భారత ప్రధాని మోడీనే కావడం గమనార్హం. సెంట్రల్ యూరప్‌లో కీలకమైన ఆర్థిక భాగస్వామి పోలెండ్ అని మోడీ వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు 70ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన జరుగుతోందన్నారు. పోలండ్‌లో ప్రస్తుతం ఉన్నది మితవాద ప్రభుత్వం అన్న సంగతి తెలిసిందే. ఇరువురు నేతల మధ్య చర్చల్లో పలు అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు పోలెండ్‌లో భారత రాయబారి నగ్మా మహ్మద్ మాలిక్ వ్యాఖ్యానించారు. 1991లో ఉక్రెయిన్ స్వతంత్ర దేశంగా అవతరించిన తర్వాత ఆ దేశంలో పర్యటిస్తున్న మొట్టమొదటి భారత ప్రధాని మోడీనే. ఉక్రెయిన్ యుద్ధ పరిష్కారం గురించి జెలెన్‌స్కీతో కలసి ఆయన చర్చించనున్నారని మాలిక్ తెలిపారు.



వార్సాలో మోడీకి ఆహ్వానం పలుకుతున్న ఆండ్రెజ్

డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా కమలా హారిస్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరపున అభ్యర్థిగా కమలా హారిస్ పోటీ చేయనున్నారు. గత మూడు రోజులుగా ఇక్కడ జరుగుతున్న ఆ పార్టీ జాతీయ సదస్సులో మంగళవారం లాంఛనంగా నిర్వహించిన రోల్ కాల్ ఓట్ (వాయిస్ ఓట్)లో ఆమెకు అత్యధిక డెలిగేట్ల మద్దతు లభించడంతో అధికారికంగా ఆమెకు పార్టీ టికెట్ ఖరారు చేశారు. ఆగస్టు మొదటి వారంలోనే అభ్యర్థిత్వం పొందేందుకు అవసరమైన ప్రతినిధుల మద్దతు ఆమె సంపాదించుకున్నారు. దీంతో జాతీయ కన్వెన్షన్‌లో ఓటింగ్ పద్ధతికి బదులు 'రోల్ కాల్ ఓటు' విధానాన్ని చేపట్టి గంటలో ఎంపిక ప్రక్రియ ముగించారు. దీంతో ఆమె అభ్యర్థిత్వాన్ని డెమొక్రాటిక్ సదస్సు అధికారికంగా ధ్రువీకరించినట్లైంది. హారిస్ స్వంత రాష్ట్రమైన కాలిఫోర్నియాలో ఆమెకు 482 ఓట్లు లభించాయి. దేశ భవిష్యత్తు కాలిఫోర్నియాలో రూపు దిద్దుకుంటోందని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ వ్యాఖ్యానించారు. ఐదు రోజుల పాటు ఆన్‌లైన్ బ్యాలెట్ ప్రక్రియ తర్వాత పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా హారిస్‌ను అధికారికంగా ధ్రువీకరిస్తున్నట్లు డెమొక్రటిక్ పార్టీ జాతీయ కమిటీ ప్రకటించింది. ఈ నెల 19 నుండి 22 వరకు జరుగుతున్న పార్టీ జాతీయ సదస్సులో ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన మంగళవారం వెలువడింది. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, మాజీ ఫస్ట్ లేడీ మిషెల్లి ఒబామా, వెర్మాంట్ సెనెటర్ బెర్నీ శాండర్స్ ప్రభృతులు ప్రసంగించారు. ఒకపక్క సదస్సు కొనసాగుతుండగా, మరోవైపు చికాగోలో పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు జరిగాయి.

భారత్ బంద్ పాక్షికం

- ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లపై సుప్రీం తీర్పుని వ్యతిరేకిస్తూ నిరసనలు



పాట్నాలో ఆందోళన చేస్తున్న బిఎస్‌పి నేతలు, కార్యకర్తలు

న్యూఢిల్లీ : ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని వ్యతిరేకిస్తూ దళితులు, ఆదివాసీ సంఘాల జాతీయ సమాఖ్య (ఎన్‌ఎసిడిఎఒఆర్) పిలుపు మేరకు నిర్వహించిన భారత్ బంద్‌కు పాక్షిక స్పందన లభించింది. బంద్‌కు మద్దతునిస్తున్నట్లు కాంగ్రెస్, జెఎంఎం, ఆర్‌జెడి, సమాజ్‌వాదీ పార్టీ, బిఎస్‌పి ప్రకటించాయి.

పలు రాష్ట్రాల్లో పాక్షికం

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో బిఎస్‌పి, భీమ్ సేన కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. దీంతో ఈ జిల్లాలో భారీగా భద్రతా దళాలను మోహరించారు. అస్సాంలో బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఒరిస్సాలో రైలు, బస్సు సర్వీసులు పాక్షికంగా నిలిచిపోయాయి. రాజస్థాన్‌లో బంద్ ప్రభావం మిశ్రమంగా ఉంది. కొన్ని జిల్లాలో పాఠశాలలు, దుకాణాలను మూసివేశారు. భరత్‌పూర్‌లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. బంద్ ప్రభావంతో పలు ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ స్తంభించింది. కేరళలో బంద్ ప్రశాంతంగా జరిగింది. బీహార్‌లో ఆందోళనకారుల ర్యాలీలతో కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాష్ట్ర రాజధాని పాట్నాలో ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. జెహనాబాద్ జిల్లాలో, 83వ నెంబరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అడ్డుకోవడానికి యత్నించడంతో ఆందోళనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. దీంతో ఐదుగురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. మాధేపురా, ముజఫర్‌పూర్‌లలో కూడా అనేక చోట్ల నిరసనకారులు ట్రాఫిక్‌ను అడ్డుకునేందుకు యత్నించారు. భద్రతా దళాలు వారిని చెదరగొట్టాయని పోలీసులు తెలిపారు. జార్ఖండ్‌లో బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రాజధాని రాంచీ సహా చాలా ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేశారు. బంద్‌కు మద్దతుగా జెఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జెడి కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు.

పోలీసింగ్‌తో భద్రత, భరోసా

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చులకు పెండింగ్‌లో ఉన్న రూ.10కోట్ల వెంటనే విడుదల చేస్తున్నట్లు, సిసి కెమెరాల ఏర్పాటులో పెండింగ్‌లో ఉన్న రూ.11కోట్లు బిల్లులు కూడా మంజూరు చేస్తున్నట్లు సిఎం తెలిపారు. పోలీస్ శాఖను ఆధునీకరించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వాటాగా రూ. 61కోట్లు విడుదల చేయడానికి సిఎం ఆమోదం తెలిపారు.

వైసిపి హయాంలో 46శాతం పెరిగిన నేరాలు:

2014-19తో పోల్చితే 2019-24 మధ్య క్రైమ్ రేటు 46శాతం పెరిగిందని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు సిఎంకు వివరించారు. 14-19తో పోల్చుకుంటే 19-23 మధ్య కాలంలో మహిళలపై నేరాలు 35.91శాతం, మహిళల అదృశ్యం కేసులు84.83 శాతం, సైబర్ నేరాలు 134.43శాతం పెరిగాయి. గంజాయి,డ్రగ్స్ కేసులు 107.89శాతం, చిన్న పిల్లలపై నేరాలు 151.88 శాతం పెరిగాయి.

కాలం చెల్లిన వాహనాలు, పనిచేయని డ్రోన్లు:

పోలీస్‌శాఖ వద్ద 143 డ్రోన్లు ఉంటే అందులో 88 మాత్రమే పనిచేస్తున్నాయి. బాడీ వోర్న్ కెమెరాలు 1,250 ఉంటే అందులో పనిచేస్తున్నవి కేవలం 444 మాత్రమే! లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌లో 1,180 కెమెరాలకు కాను , పనిచేస్తుంది 317 మాత్రమేనని పోలీస్ శాఖ అధికారులు సిఎంకు వివరించారు. ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ కూడా పనిచేయడం లేదని తెలిపారు. వీటన్నింటిని తిరిగి వాడుకలోకి తెచ్చేందుకు అవసరమైన రూ.30కోట్ల నిధులు గత ప్రభుత్వం ఇవ్వలేదని అధికారులు సిఎంకు తెలిపారు. యాన్యువల్ మెయిన్‌టెనెన్స్ చార్జీలు చెల్లించకపోవడంతో చాలా సేవలు అందుబాటులో లేకుండా పోయాయని, ఫలితంగా నేర విచారణలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.

ఫామాయిల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

మలేషియా నుండి ఓడల ద్వారా క్రూడ్ పామాయిల్ కృష్ణపట్నం పోర్టుకు వస్తుంటుంది. అక్కడి నుంచి పంటపాలెంలోని ఎనిమిది పామాయిల్ ఫ్యాక్టరీలకు పైపుల ద్వారా సరఫరా అవుతుంటుంది. ఆయిల్‌ను శుద్ధి చేసి ప్యాకెట్లు, డ్రమ్ముల ద్వారా మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటారు. ఇక్కడ జరిగిన ప్రమాదం స్థాయి పూర్తి వివరాలు తెలియలేదు. బాయిలర్ పేలిందా? ఇంకా ఏదైనా ప్రమాదం జరిగిందా? ప్రమాద ఘటనలో ఎవరైనా చనిపోయారా? గాయపడ్డారా? అనే విషయాలపై ఫ్యాక్టరీ యాజమాన్యం నోరు విప్పడం లేదు. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేరంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. పోలీసు, రెవెన్యూ, ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు. ఈ ప్రమాదంలో కొందరికి గాయాలైనట్లు, వారిని రెండు అంబులెన్సుల్లో రహస్యంగా తరలించినట్లు ప్రచారం జరుగుతోంది. విషయాలు బయటకు రానీయకుండా యాజమాన్యం గోప్యంగా ఉంచుతోందని విమర్శలు వస్తున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బతుకులు ఛిద్రం

(మొదటిపేజీ తరువాయి)



ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

వినిపించింది. పరిగెత్తుకుంటూ వచ్చిన స్థానికులకు మంటలు, దుమ్ము,ధూళి తప్ప మరేమీ కనిపించలేదు, ప్రమాద విషయం తెలిసిన వెంటనే యలమంచిలి, అచ్యుతాపురం, అనకాపల్లి, ఎన్‌టిపిసికి చెందిన అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఎన్‌డిఆర్ఎఫ్, సిఆర్‌పిఎఫ్ బృందాలు గాలింపు చర్యలను చేపట్టాయి.గాయాలపాలైన కార్మికులను అచ్యుతాపురం, అనకాపల్లిలోని ఆస్పత్రులకు తరలించారు. ఫార్మా పరిశ్రమ ఆవరణ రసాయనిక విష వాయువుతో నిండిపోయింది.

అంతా గోప్యం...

తీవ్ర ప్రమాదం తరువాత యాజమాన్యం వ్యవహరించిన తీరు అనుమానాస్పదంగా మారింది. ప్రమాద స్థలానికి ఎవరినీ అనుమతించలేదు. పేలుడు శబ్దం విని సహాయం చేయడానికి పరిగెత్తుకుంటూ వచ్చిన స్థానికులను కూడా ప్రధాన గేటు వద్దే అడ్డుకున్నారు. కార్మికుల బంధువులను కూడా లోపలికి అనుమతించలేదు. తమ వారికి ఏమైందని ఆరా తీస్తున్న వారికి సమాధానం దొరకడం కష్టమైపోయింది. దీంతో ఆస్పత్రులకు వెళ్లి వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక మీడియాను ఆ దరిదాపులకు కూడా అనుమతించలేదు. దీంతో వెనుక గేటు వైపునకు వెళ్లిన కొందరు మీడియా ప్రతినిధులకు అక్కడి గోడపై కూడా ఛిద్రమైన శరీరభాగాలు కనిపించాయి. ఘటనా స్థలాన్ని కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్‌పి దీపిక పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు పరిశ్రమ యాజమాన్యం భద్రత చర్యలు పాటించకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని కార్మికులు, కార్మికుల సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీల్లో తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేయడం, కమిటీలు వేసి చేతులు దులుపుకోవడం చేస్తున్నారని మండిపడ్డారు. పరిహారం గురించి ఒక్కమాట కూడా చెప్పకుండా మృతదేహాలను తరలిస్తుండంతో సిఐటియు నేతృత్వంలో కార్మికులు ఆందోళనకు దిగారు.

ఉన్నత స్థాయి విచారణకు సిఎం ఆదేశం

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సిఎం చంద్రబాబు గురువారం సందర్శించనున్నారు. ఫార్మా కంపెనీలో ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణకు ఆయన ఆదేశించారు. ఘటనపై సమీక్ష చేసిన ఆయన అవసరమైతే క్షతగాత్రులను విశాఖ లేదా హైదరాబాద్‌కు తరలించేందుకు ఎయిర్ అంబులెన్స్‌లను వినియోగించాలని అధికారులను సిఎం ఆదేశించారు. ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

దురదృష్టకరం : డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాద సంఘటన దురదృష్టకరమని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. సెజ్‌లోని ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు కారణంగా పలువురు మరణించడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. మృతుల కుటుంబాలను తమ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రేపు అచ్యుతాపురానికి జగన్

ఘటనా స్థలాన్ని వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సందర్శించనున్నారు. సెజ్‌లోని ఫార్మాకంపెనీలో రియాక్టర్ పేలుడు కారణంగా పలువురు మరణించడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని జగన్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తమ ప్రభుత్వం ఎల్‌జి పాలిమర్స్ బాధితులను ఆదుకున్న తరహాలోనే ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఫార్మాకంపెనీ ప్రమాదంలో మృత దేహాల వెలికితీత కొనసాగుతోంది. రాత్రి 12 గంటల సమయానికి మృతులల్లో 17 మందిని గుర్తించారు. వీరిలో 12 మందికి వివాహమైంది.

మృతుల వివరాలు

పేరు	హోదా	విద్యార్హత	సొంతూరు
1.నీలాపు రామిరెడ్డి(49)	అసోసియేట్ జనరల్ మేనేజర్	పిహెచ్‌డి	కొత్త వెంకోజిపాలెం, విశాఖపట్నం
2.ప్రశాంత్ హంస(34)	సీనియర్ ఎగ్జిక్యూటివ్	బిఎస్‌సి	పొందూరు, శ్రీకాకుళం జిల్లా
3. నారాయణరావు మహంతి(34	అసిస్టెంట్ మేనేజర్	ఎమ్ఎస్‌సి	గరివిడి, విజయనగరం జిల్లా
4.గణేష్ కుమార్ కొప్పర్తి(33)	సీనియర్ ఎగ్జిక్యూటివ్	బిఎస్‌సి	బిక్కవోలు, తూర్పుగోదావరి జిల్లా
5.హారిక చల్లపల్లి(22)	ట్రైనీ ఇంజనీర్	బిటెక్	రమణయ్యపేట, కాకినాడ
6.రాజశేఖర్ పైడి(23)	ట్రైనీ ప్రాసెస్ ఇంజనీర్	బిటెక్	ఆమదాలవలస, శ్రీకాకుళం జిల్లా
7.సతీష్ మరిశెట్టి(31)	సీనియర్ ఎగ్జిక్యూటివ్	బిఎస్‌సి	పసర్లపూడిలంక, తూర్పుగోదావరి
8.మొండి నాగబాబు(36)	అసిస్టెంట్ మేనేజర్	బిఎస్‌సి	సామర్లకోట,తూర్పుగోదావరి జిల్లా
9.బొడ్డు నాగేశ్వరరామచంద్రారావు(47)	అసిస్టెంట్ మేనేజర్	ఎమ్ఎస్‌సి	కూర్మన్నపాలెం, విశాఖపట్నం జిల్లా
10.సన్యాసినాయుడు వేగి(53)	హౌస్‌కీపింగ్	8వ తరగతి	గోకివాడ,అనకాపల్లి జిల్లా
11.చిన్నారావు ఎల్లబిల్లి(34)	పెయింటర్	ఇంటర్	దిబ్బపాలెం, అనకాపల్లి జిల్లా
12.పార్థసారథి జవ్వాది(27)	ఫిట్టర్	ఐటిఐ	డోకిసిల, పార్వతీపురం మన్యం జిల్లా
13. మోహన్‌దుర్గా ప్రసాద్ పూడి(19)	హౌస్ కీపింగ్	ఐటిఐ	దిబ్బపాలెం,అనకాపల్లి జిల్లా
14.ఆనందరావు బమ్మిడి(36)	అసిస్టెంట్ మేనేజర్	బిఎస్‌సి	గొల్లపేట, విజయనగరం జిల్లా
15.సురేంద్ర మర్ని(37)	అసిస్టెంట్ మేనేజర్	బిఎస్‌సి	గంగారామ్, ఖమ్మం జిల్లా
16.వెంకటసాయి పూసర్ల(27	సీనియర్ ఎగ్జిక్యూటివ్	బి.విఎసి	బంగారమ్మపాలెం, అనకాపల్లి జిల్లా
17.చిరంజీవి జవ్వాది(24)	ఫిట్టర్	ఐటిఐ	దార్లపూడి, అనకాపల్లి జిల్లా

యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు : సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ ఫ్రైమ్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి ఏడుగురు కార్మికులు మృతి చెందడంపై సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటించింది. దీనిపై విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండు చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పరిశ్రమలు కార్మికుల ప్రాణాలను యాజమాన్యం గాలికి వదిలేస్తున్నాయని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు కమిటీల పేరుతో హడావుడి చేస్తున్నారని, కంపెనీల భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఉన్న లోపాలపై కార్మికుల, తదితర శాఖలు నిరంతరం తనిఖీలు చేయడం లేదని పేర్కొన్నారు. నెలరోజుల్లోనే మూడు ప్రమాదాలు జరిగాయని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. గతంలోనూ పరవాడ, అచ్యుతాపురం, సెజ్‌లో జరిగిన ప్రమాదాలపై అధికార యంత్రాంగంతో కమిటీలు వేసి విచారణ నిర్వహించారని, ఆ కమిటీలు ఇచ్చిన నివేదికలు బహిర్గతం చేసి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటే నేడు ఇలాంటి ప్రమాదాలు జరిగేవి కావని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ప్రమాదాలకు కారణమైన కంపెనీలపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించేటట్లు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరింది.

న్యాయ విచారణ జరపాలి : సిఐటియు

ఎసెన్షియల్ ఫార్మా కంపెనీలో ప్రమాదంపై న్యాయ విచారణ జరపాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వి.నాగేశ్వరరావు, ఎస్.నరసింగరావు కోరారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. ఫార్మా, రసాయన పరిశ్రమల్లో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో తనిఖీలు లేకుండా చేశారని తెలిపారు. ఏ పరిశ్రమలోనూ కనీస ప్రమాదాలు పాటించడం లేదని పేర్కొన్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ పేరుతో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు అన్ని కంపెనీలు సర్టిఫికెట్లు ఇస్తున్నాయని వివరించారు. కానీ పాటించడం లేదని వెల్లడించారు. ముఖ్యంగా రియాక్టర్ల వద్ద పాటించాల్సిన భద్రతలను పట్టించుకోవడం తీవ్రమైన నేరమని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పరిశ్రమలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని వారు డిమాండు చేశారు.

గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో

- 28 మంది చిన్నారులు మృతి
- ఇతర ఇన్ఫెక్షన్లతో మరో 73 మంది బలి

గాంధీనగర్ : జులైలో మొదటి కేసు వెలుగుచూసినప్పటి నుండి ఇప్పటి వరకు 28 మంది చిన్నారులు చండీపుర వైరస్‌తో మరణించినట్లు బుధవారం గుజరాత్ ప్రభుత్వం తెలిపింది. ఈ చిన్నారులంతా 14 ఏళ్ల వయసులోపు వారేనని పేర్కొంది. రాష్ట్ర అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే ఉమేష్ మక్వానా అడిగిన ప్రశ్నకు వైద్య శాఖ మంత్రి రుషికేష్ పటేల్ సమాధానమిచ్చారు. చండీపుర వైరస్ కారణంగా జ్వరం, ఫ్లూ లక్షణాలతో పాటు తీవ్రమైన మెదడువాపు వ్యాధి లక్షణాలు ఉంటాయి. ఈ వైరస్ దోమలు, పేలు, శాండ్ ఫ్లైస్ (ఇసుక ఈగలు) ద్వారా వ్యాపిస్తోంది. చండీపుర వైరస్‌ను వ్యాప్తి చేసే శాండ్‌ఫ్లైస్ .. లోతట్టు ప్రాంతాల్లో ఉండే మట్టి నివాసాల పగుళ్లలో నివసించడం సర్వసాధారణమని అన్నారు. రాష్ట్రంలో మొత్తం 164 మెదడువాపు వ్యాధి కేసులు నమోదయ్యాయి. 14ఏళ్లలోపు 101 మంది చిన్నారులు తీవ్రమైన మెదడువాపుతో మరణించారని అన్నారు. వీరిలో 28 మంది చండీపుర వైరస్‌తో, 73 మంది ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా వచ్చే మెదడువాపుతో మరణించారని పటేల్ తెలిపారు. చికిత్స అనంతరం 63 మంది డిశ్చార్జ్ అయ్యారని, నలుగురు ఇప్పటికీ వైద్యుల సంరక్షణలో ఉన్నారని పేర్కొన్నారు. గత వారం రోజులుగా ఒక్క కొత్త కేసు కూడా రాలేదని, గడిచిన 12 రోజుల్లో ఒక్కరు కూడా మరణించలేదని, పరిస్థితి నియంత్రణలోనే ఉందని వివరించారు.

గొంతుమూయించే ప్రయత్నం

- బాలీవుడ్ నటి మల్లికా శెరావత్

ముంబయి : మద్దతు ఇవ్వడానికి బదులుగా గొంతు మూయించేందుకు ప్రయత్నిస్తున్నారని బాలీవుడ్ నటి మల్లికా శెరావత్ అన్నారు. కొల్‌కతాలోని వైద్య కళాశాలలో మహిళా జూనియర్ డాక్టరుపై హత్యాచార ఘటనకు సంబంధించి ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కొన్నేళ్ల క్రితం తాను పాల్గొన్న ఓ ప్రెస్‌మీట్ వీడియోను ఆమె షేర్ చేశారు. "దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపుల గురించి నా అభిప్రాయాన్ని తెలియజేసిన సమయంలో చాలామంది విలేకరులు నాపై మాటల దాడికి పాల్పడ్డారు. నన్ను దూషించారు. నన్ను వ్యతిరేకించారు. ఆ సంఘటనను నేను ఎప్పటికీ మర్చిపోలేను. నేను చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ బాలీవుడ్‌కు చెందిన పేరుమోసిన నటీమణులు, విలేకరులు నాపై బహిరంగంగా విమర్శలు చేశారు. ఇక్కడ మార్పు కోసం వాదించే వ్యక్తికి మద్దతు ఇవ్వడానికి బదులుగా, ప్రభావవంతమైన స్థానాల్లో ఉన్న ఈ మహిళలు నాలాంటి వారి గొంతును మూయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రవర్తన లైంగిక హింసను కొనసాగించేందుకు మరింత తోడ్పడుతుంది. కాబట్టి, ఇప్పటికైనా వారు మారాలి. ఒకరికొకరు సపోర్ట్‌గా నిలవాలి " అని మల్లికా శెరావత్ వివరించారు.

పోరాడుతుంటే.. బెదిరిస్తున్నారు : మిమీ చక్రవర్తి

కొల్‌కతా హత్యాచార ఘటనను వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీలో పాల్గొన్న సినీనటి మిమీ చక్రవర్తి కూడా బెదిరింపులు ఎదుర్కొన్నారు. మహిళల సంరక్షణ కోసం పోరాడుతుంటే.. సోషల్ మీడియా వేదికగా కొందరు తనపై అత్యాచార బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆవేదనతో ట్వీట్ చేశారు.




మీకోసం

దోరగా వేయించిన వామును ఒక పలుచటి వస్త్రంలో మూటకట్టి పిల్లల ఛాతీపై మృదువుగా కాపడం పెడితే ఆయాసం తగ్గి, ఊపిరి తేలికగా తీసుకోగలుగుతారు.

జీవన సౌరభం

స్వీకరించిన ఆదర్శాన్ని ఆచరించే ప్రయత్నంలో వేయిసార్లు విఫలమైనా మరొకసారి ప్రయత్నించండి.

చాప కింద నీరు



సిరిపురం గ్రామంలో సన్యాసయ్య, సన్యాసమ్మ దంపతులు నివసిస్తూ ఉండేవారు. ఇద్దరూ వ్యవసాయ కూలీలు. 'రెక్కాడితే కానీ డొక్కాడని' జీవితం వారిది. అయితే సన్యాసయ్యకి పొగ తాగే అలవాటుంది. 'ధూమపానం ఆరోగ్యానికి హానికరమని' భార్య చెప్పినా వినకుండా 'ఎవరు పదికాలాలు బతుకుతారు.' అని వాదించేవాడు సన్యాసయ్య.

కొంతకాలానికి సన్యాసయ్యకి ఆకలి మందగించడం, తొందరగా అలసిపోవడం మొదలైంది. వయసు ప్రభావం అనుకున్నాడు, పెద్దగా పట్టించుకోలేదు. ఇంకొంతకాలానికి సన్యాసయ్య ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో భర్తను తీసుకుని పెద్దాసుపత్రికి వెళ్ళింది సన్యాసమ్మ. అక్కడ అన్ని పరీక్షలు చేశాక రాచపుండు 'చాప కింద నీరు'లా విస్తరించిందని, పరిస్థితి చేయి దాటిపోయిందని, డాక్టర్లు చెప్పారు. చేసేదేమీ లేక ఇంటికి తిరిగి వచ్చారు భార్యాభర్త.

భర్త అనారోగ్యానికి, చాప కింద నీరుకి సంబంధం ఏమిటో అర్థం కాని సన్యాసమ్మ, ఎలాగైనా ఆ విషయం తెలుసుకుని భర్తకి స్వస్థత చేకూరేలా చెయ్యాలి అనుకుంది. ఊళ్లో ఉన్న వృద్ధుడు, తన దగ్గరి బంధువు సోమయ్యను కలిసింది. చాపకింద నీరు అంటే ఏమిటి? దానికీ తన భర్త అనారోగ్యానికి గల కారణం ఏమిటో చెప్పమని కోరింది. ఆమె అమాయకత్వానికి నవ్వుతూ సోమయ్య చెప్పడం ప్రారంభించాడు.

'పూర్వం సీతారాంపురం గ్రామంలో ధనయ్య అనే కిరాణా వ్యాపారి నివసించేవాడు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన వ్యాపారం చేసేవాడు. ఓ ఏడాది వర్షాలు ఎక్కువగా పడ్డాయి. గదిలో ఉన్న సరుకులు చెమ్మకు పాడైపోతాయనే ఉద్దేశ్యంతో గచ్చుమీద చాపలు పరిచి వాటిమీద సరుకులన్నిటినీ ఉంచాడు. గోడల వెంబడి నీరు చెమర్చి చాప కిందకు చేరింది. ఆ విషయాన్ని ధనయ్య గమనించలేదు. కాలం గడిచింది చాప కింద నీరు ఉండటం వల్ల కొద్దిరోజులకు చాప నానిపోయి, దాని మీద సరుకులన్నీ తడిసి ముద్దయ్యాయి. జరిగిన నష్టాన్ని చూసి లబోదిబోమన్నాడు ధనయ్య.

ముందుగా గ్రహించడానికి అవకాశం లేకుండా, ఎలాంటి ముందస్తు సంకేతాలు లేకుండా పెద్ద నష్టం జరిగినప్పుడు లేదా వ్యాధి ముదిరి అనారోగ్యం పాలైనప్పుడు వాడే జాతీయం ఇది. అంతేకానీ చాప కింద నీటి వల్ల నీ భర్త ఆరోగ్యం పాడవలేదు. నువ్వు చెప్పినా వినకుండా పొగతాగడం వల్లే నీ భర్త అనారోగ్యం పాలయ్యాడు' అని వివరించాడు సోమయ్య. చాప కింద నీరు అంటే ఏమిటో తెలుసుకున్న సన్యాసమ్మ కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయాల్లో ముందటి కంటే మరింత జాగ్రత్తలు తీసుకోవడం మొదలు పెట్టింది.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445.

నేను గీసిన బొమ్మ





దలాయి వర్షిత్,
6వ తరగతి,
ఇన్ఫెంట్ జీసస్ స్కూలు, టెక్కలి,
పెద్ద కేశినాయుడు పేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మంచి ఆహారంతోనే ఆరోగ్యం



వర్షాలు కురుస్తున్నప్పుడు, లేదా ముసురు పట్టినప్పుడు కొందరు వేడి వేడి టీ, కాఫీలు తాగుతుంటారు. అయితే వాటికి బదులు గ్రీన్ టీ, బ్లాక్ టీ, హెర్బల్ టీ వంటివి తీసుకోవటం ఎంతోమంచిది. వీటితోపాటు అల్లం, మిరియాలు, తేనెతో తయారు చేసిన టీ తాగితే ఆరోగ్యానికి చాలామంచిది. బజ్జీలు, పునుగులు, బోండాలకు బదులు వేడి వేడి ఉగ్గాణి, సెనగ, పెసర గుగ్గిళ్లు, సగ్గుబియ్యం కిచిడీ మంచిది. పుదీనా, తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి. కాబట్టి వీటితో కషాయం కాచుకుని తాగితే మంచిది. రాగులు, సోయాబీన్, పెసలు, మొక్కజొన్న వంటి పప్పు ధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలు దరి చేరవు. వీటితోపాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు ప్రధానంగా దానిమ్మ, ఆపిల్, స్ట్రాబెర్రీ, అరటి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బచ్చలి కూర వంటివి తీసుకుంటే ఎంతోమంచిది. అల్లం, నేరేడుపండు, తులసి, నిమ్మ, మిరియాలు, పసుపు, లవంగం, దాల్చినచెక్క వంటివి కూడా ఆరోగ్యానికి బాగా దోహదపడతాయి.

చక్కెర పదార్థాలకు దూరంగా ఉండాలి

రోగ నిరోధక శక్తిని బలోపేతం చేయాలంటే చక్కెర పదార్థాలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఐస్‌క్రీం, కేక్, క్యాండీ, చాక్లెట్, కూల్‌డ్రింక్స్ తీసుకోవటం వల్ల రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి చాలా హాని కల్గిస్తాయి. చాలామంది ప్యాక్ చేసిన ఆహారాలను తినడానికి ఇష్టపడతారు.ఇవి ఆరోగ్యానికి మంచివికాదు. అధిక ఉప్పు ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. ఆల్కహాల్, ధూమపానం కూడా శరీరాన్ని బలహీనంగా మారుస్తాయి. అందుకే వీటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ఎంతటి అనారోగ్యాన్నైనా మంచి ఆహారపు అలవాట్లతో మన దరికి రాకుండా చేయొచ్చు. పరిశుభ్రమైన గాలి, కలుషితం లేని నీరు, శుభ్రమైన ఆహారం మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

వర్షాకాలంలో ఆరోగ్య సంరక్షణకు ఫుడ్ సేఫ్టీ అథార్టీ ఆఫ్ ఇండియా సూచనలు చేసింది.

- వంట చేసేముందు మార్కెట్ నుంచి తీసుకొచ్చిన ఆకుకూరలు, కూరగాయల్ని బాగా కడగాలి.



డాక్టర్ శాంతిశ్రీ కె.వి.,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్, డైటెటిక్స్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

- పరిసర ప్రాంతాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- చేతుల్ని తరచుగా సబ్బునీటితో కడగాలి. వంట చేసే ముందు కూడా చేతులను శుభ్రపర్చాలి
- వంటకు శుభ్రమైన నీటిని ఉపయోగించాలి. కలుషితమైన, అపరిశుభ్రంగా ఉండే నీటి వాడకం ఆరోగ్యానికి ముప్పు.
- తాజాగా వండిన ఆహారాన్ని తీసుకోవాలి. ఎక్కువ ఆహారం వండి నిల్వ చేయకూడదు.
- వేడి వేడి ఆహారాలు తినటమే మంచిది. నిల్వవుంచిన ఆహారాల్లో బ్యాక్టీరియాలు చేరి ఆరోగ్యానికి హాని చేస్తాయి.
- పులిచిపోయిన పెరుగు, పాలు వంటి పదార్థాలను సేవించరాదు.
- తాజాగా ఉండే ఆహార ఉత్పత్తులను తినటం మేలు. వీటిలో పోషకాలు మెండుగా ఉంటాయి
- తీసుకునే ఆహారంలో అల్లం, వెల్లుల్లి, మిరియాలు, జీలకర్ర, కొత్తిమీర, పసుపు ఉండేలా చూసుకోవాలి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. తద్వారా వర్షాకాలంలో రోగాల భారిన పడకుండా కాపాడతాయి.
- వ్యక్తిగత పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలి.
- ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- దోమలు కుట్టకుండా ఈకాలంలో దోమ తెరలు వాడటం మేలు
- తినే ఆహార పదార్థాలపై తగిన విధంగా మూతలు వేయాలి.
- శరీరంపై తేమని పీల్చు విధంగా తగిన గాలి తగిలే విధంగా వదులుగా ఉండే దుస్తులు ధరించటం మేలు.

ఖర్జూరం పోషకాల సారం



ఖర్జూర పండ్లలో విటమిన్ ఎ, బిలు అధికంగాఉంటాయి. ఈ రెండూ ఇందులో ఉండటం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

- రక్తహీనతతో బాధపడుతున్నవారు, నీరసంగా ఉండేవారు, ఖర్జూర పండ్లు, పాలు, మీగడ లేదా కొద్దిగా నెయ్యి కలిపి ఉదయాన్నే అల్పాహారంగా తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- సెలీనియం, మెగ్నీషియం, కాపర్, మెగ్నీషియం అధికంగా ఉండటం వల్ల ఎముకల పటుత్వానికి దోహదపడతాయి.
- గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి నేచురల్ షుగర్స్ వల్ల శరీరానికి నీరసం రానివ్వదు. ఓస్టిరియో ఫోసిస్ కండీషన్‌ను నివారించడానికి ఇవి సహాయపడతాయి.
- ఫోరిన్, ఐరన్ దంతాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. రక్తహీనతతో బాధపడే గర్భిణీలు, మహిళలు ఖర్జూరం తరచూ తీసుకోవాలి.
- జీర్ణకోశ సమస్యలు ఉన్న వారు పాలల్లో 4 నుంచి 5 ఎండు ఖర్జూర పండ్లు వేసి మరగబెట్టి తాగితే త్వరగా నిద్రపడుతుంది.



వర్కవుట్ల తర్వాత ఇవి తినండి..

ఫిట్‌నెస్ కోసం వర్కవుట్లు చేయడం ఈ రోజుల్లో సర్వసాధారణం. అయితే ఎక్సర్‌సైజ్ చేసిన తర్వాత క్రమం తప్పకుండా శరీరానికి అవసరమైన పోషకాలు అందించాలి. ప్రొటీన్లు ఎక్కువగా లభించే ఆహారం తీసుకోవాలి. గుడ్లు, చికెన్, పప్పుధాన్యాల్లో మాంసకృత్తులు అధికంగా లభిస్తాయి. వర్కవుట్ల తర్వాత ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోకపోతే ఫలితం అంతంతమాత్రమే అంటున్నారు నిపుణులు. అందుకే, వ్యాయామం ముగిసిన గంటలోపు ప్రొటీన్ ఫుడ్ తీసుకోవడం వల్ల కండరాలు గట్టిపడటంతోపాటు సత్వర శక్తి వస్తుందని చెబుతున్నారు.

వర్కవుట్ సెషన్ తర్వాత స్వల్ప కాల వ్యవధిని అనబాలిక్ విండోగా పిలుస్తారు. ఈ సమయంలో వ్యాయామం చేసిన వ్యక్తి కండరాల ఎదుగుదలకు, రికవరీకి ప్రొటీన్ ఫుడ్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్కవుట్స్ సమయంలో కండరాలు సున్నితంగా మారతాయి. కొన్నిసార్లు అవి నొప్పి కూడా కలిగిస్తాయి. ప్రొటీన్లు కలిగిన ఆహారం తింటే కండరాలు శక్తిని పుంజుకుంటాయి.

అందుకే రోజులో ఏ సమయంలోనైనా ప్రొటీన్ ఫుడ్ తీసుకోవచ్చని చెబుతున్నారు. రోజులో కావాల్సిన ప్రొటీన్ ఒకేసారిగా కాకుండా, మూడు-నాలుగు దఫాలుగా తీసుకుంటే మంచిదని అంటున్నారు. అల్పాహారం, భోజనం, స్నాక్స్‌లో ప్రొటీన్ కంటెంట్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. వర్కవుట్ల తర్వాత ఈ పదార్థాలు తీసుకుంటే శరీరానికి తగినన్ని ప్రొటీన్లు లభిస్తాయి. గుడ్డు మంచి ప్రొటీన్‌ను అందిస్తుంది. ఒకటి, రెండు ఉడకబెట్టిన గుడ్లు తిని, గ్లాసెడు పాలు తాగితే ఎనర్జిటిక్‌గా ఉంటారు.


- కొబ్బరినీళ్లు, మునగాకు పొడి కలుపుకొని తాగినా శరీరానికి ప్రొటీన్లు అందుతాయి.
- గుప్పెడు నానబెట్టిన బాదం పప్పు, కప్పు పెరుగు తీసుకోవచ్చు.
- బీట్‌రూట్‌లో పోషక విలువలు అధికంగా ఉంటాయి. కండరాల పటుత్వానికి ఇవి దోహదం చేస్తాయి. బీట్‌రూట్ ముక్కలు గానీ, జ్యూస్ గానీ తీసుకుంటే మంచిది.
- ఉడికించిన శనగలు తింటే శరీరానికి ప్రొటీన్లు సమృద్ధిగా అందుతాయి.
- సత్తుపిండి సత్వర శక్తిని ఇస్తుంది. కండరాలు బలోపేతం కావడానికి దోహదం చేస్తుంది.

చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపుల నిరోధానికి ప్రత్యేక చట్టం

- కేరళ ప్రభుత్వ నిర్ణయం

మలయాళ చిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చిత్రసీమలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని, ఆ సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను సూచించేందుకు ప్రభుత్వం 2019లో హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మహిళలపై వేధింపులు, శ్రమ దోపిడి, అసభ్యంగా ప్రవర్తించడం లాంటివి సాధారణంగా మారాయని, క్రిమినల్ గ్యాంగ్స్ కనుసన్నల్లో మలయాళ చిత్రపరిశ్రమ నడుస్తోందని కమిటీ ఆరోపించింది. సమస్య పరిష్కారానికి పటిష్ఠ చట్టం అవసరమని, ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.


హేమ కమిటీ నివేదిక సమర్పిస్తున్నప్పటి పాత చిత్రం



26న 'ముఫాసా : ది లయన్ కింగ్' ట్రైలర్

'ది లయన్ కింగ్' ప్రాజెక్టుకు ప్రీక్వెల్‌గా వస్తోంది 'ముఫాసా: ది లయన్ కింగ్'. ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకానుంది. ఈ మూవీ హిందీ వెర్షన్‌లో ముఫాసా పాత్రకు బాలీవుడ్ యాక్టర్ షారుఖ్ ఖాన్ వాయిస్ ఓవర్ అందించారు. తెలుగు వెర్షన్‌కు మహేశ్ బాబు వాయిస్ అందించారు. తాజా సమాచారం ప్రకారం తెలుగు ట్రైలర్ ఆగస్టు 26న ఉదయం 11:07 గంటలకు లాంచ్ చేయనున్నారు. ఈ ఈవెంట్‌లో మహేశ్ బాబు సందడి చేయనున్నారు. లయన్ కింగ్ సినిమాకు తెలుగుతోపాటు హిందీ ఆయా భాషల్లో పలువురు నటులు డబ్బింగ్ చెప్పారు. సింబా పాత్రకు నాని డబ్బింగ్ చెప్పారు. ఈ ప్రీక్వెల్‌లో ముఫాసా అడవికి రాజుగా ఎలా ఎదిగాడు అతడి సోదరుడు టాకా ఎలా చనిపోయాడు..? అలాగే ముఫాసా చంపాలని చూస్తున్నా స్కార్ ఏం చేశాడు..? అనేది తెరకెక్కించారు. ఫొటో రియలిస్టిక్ టెక్నాలజీతో వస్తున్న ఈ సినిమాకు అకాడమీ అవార్డ్ విజేత బేరీ జెంకిన్స్ దర్శకుడు ఆరోన్ స్టోన్, కెల్విన్ హ్యారిసన్ జూనియర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

23న 'రేవు' సినిమా విడుదల



సామాజిక సమస్యలను పట్టిచూపేలా తీసిన సినిమా 'రేవు'. రంగస్థల కళాకారుడు ఏపూరి హరిబాబు లీడ్‌రోల్‌లో నటిస్తున్నారు. ఆంటోనీ, గొడవర్తి శ్రీనివాస్, నెమలికంటి రమణ, మనోహర్, బంగారు నాగమణి, లక్ష్మీతులసి, రాజేశ్వరి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. విజయవాడ, గుంటూరుకు చెందిన కళాకారులే ఎక్కువ మంది ఇందులో నటించారు. ఈ చిత్రం ఇటీవల సెన్సార్ పూర్తిచేసుకుంది. సెన్సార్ సభ్యుల ప్రశంసలను సైతం అందుకుంది. నిర్మాత దిల్‌రాజ్ కూడా అభినందించారు. ఈనెల 23న ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదల కానుంది.



1 నుంచి బిగ్‌బాస్ 8 ప్రారంభం

బిగ్‌బాస్ సీజన్ 8 షో సెప్టెంబర్ ఒకటోతేదీ నుంచి ప్రారంభం కానుంది. ఎట్టకేలకు షో లాంచింగ్ డేట్‌ను నిర్వాహకులు ఓ ప్రోమో రిలీజ్ ద్వారా వెల్లడించారు. ఇక్కడ ఒక్కసారి కమిటైతే లిమిటే లేదు అన్న డైలాగ్‌తో వీడియో విడుదలైంది. సెప్టెంబర్ 1న రాత్రి 7 గంటలకు ప్రసారం కానున్నట్లుగా ప్రకటించారు.

సరికొత్తగా 'సినీమాయ' చేశాం



'విజయ్, అనీష్, రోహిత్, ఆశా, సస్మిత, రిత తదితరులు ప్రధాన తారాగణంగా రూపుదిద్దుకున్న సినిమా 'సినీమాయ'. రాజాసాగి సత్యనారాయణరావు (కుర్రబాబు) నిర్మాతగా, గిరి చిన్నా దర్శకత్వంలో అనగా దేవి మూవీస్, అరకు సినీ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కింది. డిఒపి ఎస్.ప్రసాద్, జయసూర్య, ఎడిటింగ్ పి.శ్యామ్‌కుమార్, సంగీతం ప్రమోద్‌కుమార్ పరిసర్ల అందించారు. మ్యూజికల్ హిట్ గ్యారంటీ అని తమ సినిమా ఖచ్చితంగా అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని దర్శకుడు గిరి చిన్నా, నిర్మాత రాజా సాగి సత్యనారాయణ రాజు (కుర్రబాబు) తెలిపారు. సింహాచలం ఆలయంలో జిఎస్‌టి కమిషనర్ గణపతి వర్మ గౌరవ దర్శకత్వం వహించగా, మణి వర్మ క్లాప్ కొట్టి ఈ సినిమా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రొడక్షన్ నం.2గా తెరకెక్కింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని రాజు, గిరి చిన్నా తెలిపారు. డిఒపి ప్రసాద్, ఎడిటింగ్ పి.శ్యామ్‌కుమార్, కొరియోగ్రాఫర్ చైతన్య, పథ్వీ రాజ్, రాజారెడ్డి, పాల్గొన్నారు.



శ్రీజేశ్‌కు కేరళ రూ.2 కోట్ల పురస్కారం

తిరువనంతపురం: భారత పురుషుల జట్టు హాకీ గోల్‌కీపర్, ఆర్‌పి శ్రీజేశ్‌కు కేరళ ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. తాజాగా కేరళ ప్రభుత్వం అతడికి రూ.2 కోట్ల నగదు పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సిఎంఒ బుధవారం ప్రకటించింది. 'భారత హాకీ జట్టులో సభ్యుడు, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన శ్రీజేశ్‌కు రెండు కోట్ల రూపాయలు బహుమతిగా అందిస్తున్నాం' అని ప్రకటనలో తెలిపింది. కేరళకు చెందిన శ్రీజేశ్ 2004లో జాతీయ జూనియర్ జట్టులో.. అనంతరం సీనియర్ జట్టులోకి చేరాడు. 20 ఏళ్లలో భారత్ తరఫున 336 మ్యాచ్‌లు ఆడాడు. అతడి ఖాతాలో రెండు ఒలింపిక్ పతకాలతో పాటు రెండు ఆసియా క్రీడల స్వర్ణాలు, రెండు కామన్వెల్త్ రజతాలు, రెండు ఛాంపియన్ ట్రోఫీ రజతాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు కాంస్యం సొంతం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. ఆ తర్వాత ఆటకు వీడ్కోలు పలికాడు. శ్రీజేశ్‌ను జూనియర్ టీమ్‌కు ప్రధాన కోచ్‌గా హాకీ ఇండియా నియమించింది. అదేవిధంగా సీనియర్ జట్టు నుంచి జెర్సీ నంబరు 16కు సైతం రిటైర్‌మెంట్ ఇస్తున్నట్లు ఇటీవల శ్రీజేశ్ ప్రకటించాడు.

ఐసిసి అధ్యక్షునిగా ఏకగ్రీవానికి జై షా ప్రయత్నం

27తో ముగియనున్న నామినేషన్లకు గడువు

నవంబర్‌తో బార్ క్లే పదవీకాలం పూర్తి



ముంబయి: అంతర్జాతీయ క్రికెట్‌మండలి (ఐసిసి) అధ్యక్షునిగా భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) కార్యదర్శి జై షా ఏకగ్రీవానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డులనుంచి ఎవ్వరూ అధ్యక్ష రేసులో లేకపోవడంతో జై షాకు లైన్ క్లియరైనట్లయ్యింది. ప్రస్తుత అధ్యక్షుడు గ్రెగ్ బార్ క్లే(న్యూజిలాండ్)పదవీ కాలం నవంబర్ 30తో ముగియనుంది. ఇప్పటికే రెండు దఫాలుగా బార్ క్లే ఐసిసి అధ్యక్షునిగా ఉన్నారు. దీంతో బిసిసిఐ కార్యదర్శి జై షా ఆ పదవిని అధిరోహించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మిగతా దేశాల బోర్డులనుంచి కూడా జై షాకు మద్దతు ఉండగా.. ఈ పదవికి పోటీపడేందుకు ఇప్పటివరకు మరొకరు దరఖాస్తు చేసుకోలేదు. మూడోసారి పోటీ చేయాలనే ఆసక్తి తనకు లేనట్టు బార్ క్లే లేకపోవడంతో ఈ నెల 27తో ఈ విషయమై పూర్తి స్పష్టత రానుంది. ఐసిసి నిబంధనల ప్రకారం ఒక టర్మ్‌కు రెండేళ్ల చొప్పున మూడు పర్యాయాలు ఛైర్మన్‌గా ఉండొచ్చు. 2020 నుంచి బార్ క్లే ఐసిసి ఛైర్మన్‌గా కొనసాగుతున్నాడు. ఐసిసి ఛైర్మన్ ఎన్నికల్లో మొత్తం 16 మంది సభ్యులు ఓట్లు వేయాల్సి ఉంది. వారిలో 9మంది ఓట్లు ఎవరికి పడితే వారు ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నికవుతారు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు మెంబర్లతో సహా మిగిలిన దేశాల క్రికెట్‌బోర్డులు కూడా జై షా వైపే ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం బిసిసిఐ కార్యదర్శిగా ఉన్న షాకు మరో ఏడాది పదవీ కాలం ఉంది. ఆ తర్వాత అతడు తప్పనిసరిగా బిసిసిఐ పదవుల నుంచి మూడేళ్ల పాటు తప్పుకోవాలి. గతంలో భారత్‌కు చెందిన జగన్మోహన్ దాల్మియా(1997-2000), శరద్ పవార్ (2010-12) ఐసిసి ఛైర్మన్‌గా పని చేశారు. జై షా ప్రస్తుతం ఐసిసి ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల ఉప సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు.



సిన్సినాటి టైటిల్ విజేతలు సిన్నర్, సబలెంక



న్యూయార్క్: టాప్‌సీడ్ టెన్నిస్ ఆటగాడు, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్‌కు ఊరట లభించింది. నిషేధిత ఉత్ప్రేరకాలను తీసుకోవడంతో రెండుసార్లు పాజిటివ్ వచ్చిన సిన్నర్‌కు తాజాగా అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ(ఐటిఐఎ) క్లీన్‌చిట్ ఇస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. 2024 ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీ శాంపిల్స్‌లో తక్కువస్థాయిలో క్లోస్టెబోల్ మెటాబోలైట్ ఉన్నట్లు తేలింది. చిన్న గాయానికి మందు రావడం కారణంగా ఇలా జరిగిందని పరీక్షల్లో తేలింది. ఇక రెండోసార్లు డోప్ పరీక్షలకు ఉల్లంఘనలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఐటిఐఎ బుధవారం సమావేశమై స్పోర్ట్స్ నిబంధనలను అతడు అతిక్రమించలేదని, స్వతంత్ర ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. దీంతో అతడు వచ్చే వారం నుంచి ప్రారంభమయ్యే యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో బరిలో దిగేందుకు దారి సుగమమైంది. సిన్సినాటి ఓపెన్ ఫైనల్లో సిన్నర్ 7-6(7-4), 6-2తో స్థానిక ఆటగాడు టఫీని ఓడించి టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్ టైటిల్ 3వ సీడ్, బెలారస్‌కు చెందిన సబలెంక కైవసం చేసుకుంది. ఫైనల్లో సబలెంక 6-3, 7-5తో 6వ సీడ్, అమెరికాకు చెందిన పెగూలాను ఓడించింది.

పాకిస్తాన్ 158/4

ఆయుబ్, షకీల్ అర్ధసెంచరీలు
బంగ్లాదేశ్‌తో తొలిటెస్ట్

రావల్పిండి: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో పాకిస్తాన్‌జట్టు తడబడి నిలబడింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 158పరుగులు చేసింది. 16పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును సైమ్ ఆయుబ్(56), షకీల్(57) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరూ 4వ వికెట్‌కు 98పరుగులు జతచేసి ఆదుకున్నారు. తొలిరోజు ఆట చివరిరోజు ఓపెనర్ ఆయుబ్(56) ఔట్ కాగా.. వికెట్ కీపర్ రిజ్వాన్(24) ధనా ధన్ బ్యాటింగ్‌తో రాణించాడు. క్రీజ్‌లో రిజ్వాన్, షకీల్ ఉండగా.. మాజీ కెప్టెన్ బాబర్ అజామ్(0), కెప్టెన్ షాన్ మసూద్(6) నిరాశపరిచారు. బంగ్లాదేశ్ బౌలర్లు షోరిఫుల్ ఇస్లామ్, హసన్ మహ్మూద్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. పాకిస్తాన్‌తో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ ఈ పర్యటనకు వచ్చింది.

శ్రీలంక 236ఆలౌట్

ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో శ్రీలంక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 236పరుగులకు ఆలౌటైంది. 113పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ శ్రీలంకను కెప్టెన్ ధనుంజయ, ప్రియనాథ్ అర్ధసెంచరీలు చేసి ఆదుకున్నారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 6పరుగుల్లోపే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత కెప్టెన్ ధనుంజయ(74), లోయర్ ఆర్డర్ బ్యాటర్ ప్రియనాథ్(72) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లు వోక్స్, బషీర్‌కు మూడేసి, అట్కిన్సన్‌కు రెండు, మార్క్ వుడ్‌కు ఒక వికెట్ దక్కాయి. అనంతరం ఇంగ్లండ్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్లేమీ నష్టపోకుండా 24పరుగులు చేసింది. డక్కెట్(13), లారెన్స్(9) క్రీజ్‌లో ఉన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68